సోమవారం
08-05-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 315
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఇజ్రాయిల్‌లో ఆగని ప్రజాందోళనలు

సుప్రీంకోర్టు జడ్జిల నియామకాధిరాలను ఇజ్రాయిల్ ప్రభుత్వానికి కట్టబెట్టడమే కాకుండా సర్వోన్నత న్యాయస్థానాన్ని తమ గుప్పెట్లో పెట్టుకునే విధంగా జరుగుతున్న ప్రధాని నెతన్యాహు చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా 18వ వారం నిరసనలు కొనసాగాయి. ఎన్నడూ జరగని స్థాయిలో శనివారం భారీ ఎత్తున ప్రజాందోళన ఇజ్రాయిల్‌లో జరిగింది.

2లో

రాష్ట్రానికి తుపాను గండం

- ఆగ్నేయ బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం
- అల్పపీడనంగా మారి వాయుగుండంగా బలపడనున్నట్లు ఐఎండీ వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: రాష్ట్రానికి తుపాను గండం పొంచి ఉంది. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనంతో మరో మూడు రోజులు వర్షాలు కొనసాగుతాయని వాతావరణ శాఖ తెలిపింది. ఇది క్రమేపీ అల్పపీడనంగా మారి వాయుగుండంగా బలపడనుందని, ఉత్తరదిశగా మధ్య బంగాళాఖాతం వైపు కదులుతూ తుపానుగా మారే అవకాశం ఉందని ఐఎండీ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే ఈ తుపానుకు మోచాగా నామకరణం చేశారు. ప్రస్తుతానికి ఇది పశ్చిమ బెంగాల్, మయన్మార్ వైపు పయనిస్తోందని అధికారులు తెలిపారు. వాతావరణ శాఖ హెచ్చరికలతో ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. మత్స్యకారులకు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు. కోస్తా, రాయలసీమ జిల్లాలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది. కొన్ని ప్రాంతాల్లో వడగండ్ల వర్షం కురిసే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. ఇప్పటికే రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. రాబోయే మూడు రోజులు కూడా మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం అంచనా వేస్తోంది. తమిళనాడు మీదుగా కొనసాగుతున్న ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో మూడు రోజులు అక్కడక్కడ పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. అల్లూరి సీతారామరాజు, ఏలూరు, పల్నాడు, ప్రకాశం జిల్లా, రాయలసీమ ప్రాంతంలోని అన్ని జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. ఇక వర్షాల కంటే ఈదురు గాలుల ప్రభావం అధికంగా ఉంటుందని, గంటకు 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశముందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఐఎండీ హెచ్చరికలతో రైతులు

- మిగతా 2 లో

హెల్ప్... హెల్ప్!

మణిపూర్‌లో ఆంధ్రా విద్యార్థుల ఆర్తనాదాలు

- ఇంఫాల్‌లో చెలరేగిన హింసతో తిండీతిప్పల్లేక ఇబ్బందులు
- దయచేసి మమ్మల్ని తీసుకెళ్లండంటూ అభ్యర్థనలు
- వారి తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన
- ఇప్పటికే ఒడిశా, తెలంగాణ ప్రభుత్వాలు తరలింపు చర్యలు

2 లో

మణిపూర్‌లో ఆంధ్రా విద్యార్థులు

బీజేపీ మద్దతుతోనే హింస

- మణిపూర్ ట్రైబల్ ఫోరం ఆరోపణ
- సిట్ విచారణ
- గిరిజనులకు భద్రత కల్పనకు వినతి
- మైతేయిలకు ఎస్టీ హోదా ప్రతిపాదన లేదు: బీజేపీ ఎమ్మెల్యే పిటిషన్
- నేడు సుప్రీంకోర్టు విచారణ

న్యూఢిల్లీ: మణిపూర్‌లో మయితే వర్గీయులకు ఎస్టీ హోదా కల్పన వ్యవహారం ఆ రాష్ట్రంలో హింసకు దారితీసింది. దీనికి సంబంధించి ఇప్పటికే సుప్రీంకోర్టులో అనేక పిటిషన్లు దాఖలయ్యాయి. కేంద్రంతో పాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మద్దతుతోనే రాష్ట్రంలో హింస జరిగిందని ఆరోపిస్తూ మణిపూర్ ట్రైబల్ ఫోరం తాజాగా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ప్రజా

- మిగతా 2 లో

కర్నాటకలో కాంగ్రెస్‌కే ఆధిక్యం

- అన్ని అంశాల్లోనూ హస్తం పార్టీనే ముందంజ
- చరిత్ర తిరగరాసేందుకు బీజేపీ యత్నాలు
- పీపుల్స్‌పల్స్ సర్వేలో వెల్లడి

బెంగళూరు: కర్నాటక రాష్ట్ర శాసనసభకు ఈ నెల 10వ తేదీన జరగనున్న ఎన్నికలలో కాంగ్రెస్‌కు స్వల్ప ఆధిక్యత కనిపిస్తోంది. గత మూడున్నర దశాబ్దాల చరిత్రలో రాష్ట్రంలో ఏ అధికార పార్టీ తిరిగి పగ్గాలు చేపట్టలేదు. చరిత్రను మార్చాలని బీజేపీ ప్రయత్నిస్తుంటే, అధికారం చేపట్టి సంప్రదాయాన్ని కొనసాగించాలన్న పట్టుదలతో కాంగ్రెస్ ఉంది. అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని పీపుల్స్‌పల్స్ చేపట్టిన ప్రీపోల్ సర్వేలో కాంగ్రెస్‌కు స్వల్ప ఆధిక్యత కనిపిస్తోంది. మహిళలు, పురుషులతో పాటు అన్ని వయస్సుల వారి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోగా ప్రధానంగా అభివృద్ధి, సంక్షేమం, సామాజిక అంశాలు, ముఖ్యమంత్రి అభ్యర్థిత్వం ఇలా అన్ని రంగాలలో కాంగ్రెస్ ఇతర పార్టీల కంటే ముందుంది. కోస్తా ప్రాంతాన్ని మినహాయించి అన్ని ప్రాంతాలలో కాంగ్రెస్ తన ప్రధాన ప్రత్యర్థి బీజేపీ కంటే ముందంజలో ఉంది. ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ వంద స్థానాలకు పైగ విజయం సాధించి స్వల్ప ఆధిక్యత సాధించే అవకాశాలున్నాయి. బీజేపీ వంద స్థానాలకులోపే పరిమితం కావచ్చు. ఇదేసమయంలో జేడీ(ఎస్) తనకు పట్టున్న స్థానాల్లో ఆధిపత్యం కొనసాగిస్తూ 24 స్థానాలకుపైగా గెలుపొందవచ్చు.

సౌత్‌ఫస్ట్ న్యూస్ వెబ్‌సైట్ కోసం పీపుల్స్‌పల్స్ నిర్వహించిన సర్వే ప్రకారం కాంగ్రెస్ పార్టీ 105-117 స్థానాలు, బీజేపీ 81-93 స్థానాలు, జేడీ(ఎస్) 24-29, ఇతరులు 1-3 స్థానాలు పొందే అవకాశాలున్నాయి. పీపుల్స్‌పల్స్ సర్వే ప్రకారం 2018లో 38.14 శాతం ఓట్లు సాధించిన కాంగ్రెస్ ఈ ఎన్నికల్లో 41.4 శాతం పొందే అవకాశాలున్నాయి. 2018లో 36.35 శాతం ఓట్లు పొందిన అధికార బీజేపీ ఇప్పుడు స్వల్పంగా 0.3 శాతం ఓట్లు కోల్పోయి 36 శాతం ఓట్లు సాధించే అవకాశం ఉందని సర్వేలో వెల్లడైంది. 2018లో కింగ్‌మేకర్ పాత్ర పోషించిన జేడీ(ఎస్) ఇప్పుడు 16 శాతం ఓట్లు సాధించే అవకాశాలున్నాయి. ఇది 2018 కంటే 2.3 శాతం తక్కువ. ఏ సర్వేలోనైనా రెండు శాతం ప్లస్ లేదా మైనస్ వ్యత్యాసాలు ఉండే అవకాశాలుంటాయి. చివరి రెండు రోజుల ప్రచారాన్ని సర్వే పరిగణలోకి తీసుకోలేదు కాబట్టి చివరి నిమిషంలో ప్రధాన పార్టీలకు లభించే అనుకూల, వ్యతిరేక అంశాలను అంచనా వేయలేం. "సౌత్ ఫస్ట్" న్యూస్ వెబ్‌సైట్ కోసం పీపుల్స్ పల్స్ రీసెర్చ్ సంస్థ డైరెక్టర్ ఆర్.దిలీప్‌రెడ్డి నేతృత్వంలో ఈ నెల 1 నుంచి 5 వరకు ఈ సర్వే నిర్వహించారు. 'ప్రాబబులిటీ ప్రొఫెషనల్ మెథడాలజీ' (పీపీఎస్) పద్ధతి ద్వారా

- మిగతా 2 లో

కాంగ్రెస్‌కు వీరశైవ లింగాయత్ మద్దతు

త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న కర్నాటక రాష్ట్రంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. కర్నాటక వీరశైవ లింగాయత్ ఫోరం కాంగ్రెస్ పార్టీకి అధికారికంగా మద్దతు ప్రకటించింది. దీంతో బీజేపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. వీరశైవ లింగాయత్ జారీ చేసిన ఈ ప్రకటన రాష్ట్రంలోని కీలకమైన లింగాయత్‌ల ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ స్థానాన్ని బాగా బలోపేతం చేస్తుందని భావిస్తున్నారు.

2 లో

21లోగా బ్రిజ్‌భూషణ్‌ను

అరెస్టు చేయాలి

- డెడ్‌లైన్ విధించిన 31 సభ్యుల కమిటీ
- లేనిపక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరిక
- రెజ్లర్లకు ఖాప్, రైతు సంఘాల సంపూర్ణ మద్దతు
- ఢిల్లీకి ఎస్‌కేఎం, బీకేయూ నేతలు - కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు
- ఇది మా పోరాటం... రైతులు హైజాక్ చేయలేదు: వినీశ్ ఫోగాట్

2లో

ఇదీ లోకం!

అణచివేతే లక్ష్యం

- హక్కుల కార్యకర్తలను అణచివేయడంలో భారత్‌కు రెండో స్థానం
- బ్రిటన్ హ్యూమన్ రైట్స్ రిసోర్స్ సెంటర్ నివేదిక



న్యూఢిల్లీ: ప్రశ్నించే గొంతుకలను నులిమివేయడంలో కేంద్రంలోని బీజేపీ సర్కార్ ముందంజలో ఉంది. ప్రజాస్వామ్య దేశంలో పౌరుల హక్కులను నిరంకుశంగా అణచివేస్తోంది. ఇప్పటికే పత్రికా స్వేచ్ఛ ప్రమాదంలో పడిందని నివేదికలు వచ్చాయి. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్ ప్రజాస్వామ్యయుతంగా హక్కుల కోసం పోరాడే కార్యకర్తలను హింసాత్మకంగా అణచివేయడంలో రెండో స్థానంలో ఉంది. ఇటీవల బ్రిటన్‌కు చెందిన బిజినెస్ అండ్ హ్యూమన్ రైట్స్ రిసోర్స్ సెంటర్ విడుదల చేసిన నివేదిక ప్రకారం... మానవ హక్కుల రక్షకులపై హింసాత్మక దాడులు జరిగిన దేశాలలో బ్రెజిల్ అగ్రభాగాన ఉండగా, భారత్ రెండో స్థానంలో ఉంది. 2022లో ప్రపంచ వ్యాప్తంగా మానవ హక్కుల కార్యకర్తలపై 550 హింసాత్మక దాడులు జరిగితే అందులో బ్రెజిల్‌లో 63, భారత్‌లో 54 దాడులు జరిగాయి.

పర్యావరణ పరిరక్షణ కోసం పోరాడినందుకు

ప్రపంచ వ్యాప్తంగా జరిగిన 550 దాడుల్లో 75 శాతం భూమి, పర్యావరణ పరిరక్షణ పోరాట కార్యకర్తలపై జరిగాయని బిజినెస్ అండ్ హ్యూమన్ రైట్స్ రిసోర్స్ సెంటర్ నివేదిక పేర్కొంది. భారత్‌లోని అగ్రశ్రేణి ఉక్కు, బొగ్గు సంస్థలకు ఈ దాడులతో సంబంధం ఉన్నట్లు వివరించింది. తూర్పు ఒడిశాలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్‌కు వ్యతిరేకంగా జరిగిన పోరాటాన్ని, పోలీసులు అణచివేసిన తీరును ప్రస్తావించింది. ఉక్కు కర్మాగారం నిర్మించాలని ఆ కంపెనీ 2018 నుంచి ప్రయత్నాలు చేస్తుండగా ప్రజలు భూసేకరణకు వ్యతిరేకంగా ఆందోళనలు చేస్తున్నారు. స్టీల్ ప్లాంట్ స్థాపనకు వ్యతిరేకంగా ప్రజలు అనేక సార్లు నిరసన తెలపగా పోలీసులు దాదాపు వెయ్యి మందిని అరెస్టు చేశారని, ఆందోళనకారుల పట్ల హింసాత్మకంగా ప్రవర్తించారని ఈ నివేదిక పేర్కొంది. మరో కంపెనీ టోటల్ ఎనర్జీస్ కూడా మానవ హక్కుల కార్యకర్తల పట్ల హింసాత్మకంగా ప్రవర్తించిందని తెలిపింది.

అమెరికాలో మళ్లీ కాల్పులు

టెక్సాస్‌లో 9 మంది, కాలిఫోర్నియాలో ఒకరి మృతి

అల్లెన్/చికో: అగ్రరాజ్యం అమెరికాలో తుపాకీ సంస్కృతి మితి మీరిపోయింది. నిత్యం కాల్పుల ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఉత్తర కాలిఫోర్నియాలో 17ఏళ్ల బాలిక కాల్చివేతకు గురికాగా టెక్సాస్‌లోని మాల్‌లో తొమ్మిది మంది కాల్పుల్లో వరణించారు. ఆగంతకుడిని పోలీసులు మట్టుబెట్టారు. ఈ రెండు ఘటనల్లో 12 మంది వరకు గాయపడ్డారు. కేవలం 24 గంటల్లో రెండు చోట్ల కాల్పులు జరిగాయి. టెక్సాస్‌లోని మాల్‌లో ఇద్దరు దుండగులు చొరబడిన విచక్షణా రహితంగా కాల్పులు జరిపి తొమ్మిది మంది ప్రాణాలను హరించారు. మరో ఏడుగురికి గాయపరిచారు. మృతుల్లో ఐదేళ్ల చిన్నారి ఉన్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. పోలీసు అక్కడకు చేరుకొన్న వెంటనే మిలిటరీ వస్త్రధారణలో ఉన్న ఓ దుండగుడిని కాల్చి చంపారు. ఏం జరుగుతుందో అర్థం అయ్యేలోపే ఇంత బీభత్సం జరిగిపోయిందని, మేమంతా భయంతో మాల్ నుంచి బయటకు పరుగులు తీశామని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. మరోవైపు ఉత్తర కాలిఫోర్నియాలో తెల్లవారుజాము 3.30 గంటలకు కాల్పులు జరిగినట్లు చికో పోలీసు చీఫ్ బిల్లీ అల్‌డ్రిజ్ తెలిపారు. గాయపడిన ఆరుగురిని ఆసుపత్రులకు తరలించగా వారిలో టీనేజర్ (17) అమ్మాయి చనిపోయిందన్నారు. 20ఏళ్ల లోపు మరో నలుగురు అబ్బాయిలు చికిత్స పొందుతున్నారని చెప్పారు. నిర్మానుష ప్రాంతంలో ఈ ఘటన జరిగిందని, స్థానికులకు ఎలాంటి ప్రమాదం లేదని, కాల్పులు జరిపిన వ్యక్తి కోసం గాలిస్తున్నామని బిల్లీ అల్‌డ్రిజ్ వెల్లడించారు.

థాయిలాండ్‌లో ఎన్నికలు

బాంకాక్: థాయిలాండ్‌లో ఈనెల 14వ తేదీన జరగనున్న ఎన్నికల కోసం ఆదివారం ముందస్తు ఓటింగ్ ప్రక్రియలో పాల్గొనేందుకు ప్రజలు క్యూకట్టారు. రెండు మిలియన్ల మందికిపైగా ఓటర్లుగా నమోదై ఉన్నారు. ఆలయాలు, షాపింగ్ సెంటర్లు, స్కూళ్ల వద్ద ఏర్పాటు చేసిన కేంద్రాల్లో జరిగిన బాలెట్ ఓటింగ్‌లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా భారీ క్యూలైన్లలో వేచివుండి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొదటిసారి ఓటు వేసిన వారు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎన్నికల వ్యవస్థ ఆర్మీ మద్దతున్న పార్టీలకు సానుకూలంగా ఉన్నప్పటికీ అభ్యర్థులు చరిత్రాత్మక విజయం నమోదు చేస్తే తప్ప తదుపరి ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉండదు. అయితే ఈసారి ఎన్నికలతో దేశంలో మార్పు వస్తుందని, తమ భవిష్యత్ మెరుగవుతుందని ఓటర్లు ఆకాంక్షించారు. కాగా ప్రతిపక్ష పార్టీ తరపున ఫ్యుథాయి, మాజీ నేత బిలియనీర్ తక్సిన్ షినవత్ర కుమార్తె పెటోంగ్‌తర్న్ షినావత్ర ప్రధాని రేసులో ఉన్నారు.

ఇజ్రాయిల్‌లో ఆగని ప్రజాందోళనలు

నెతన్యాహు ప్రభుత్వంపై పెరుగుతున్న అసంతృప్తి

టెల్‌అవీవ్: సుప్రీంకోర్టు జడ్జిల నియామకాధికారాలను ఇజ్రాయిల్ ప్రభుత్వానికి కట్టబెట్టడమే కాకుండా సర్వోన్నత న్యాయస్థానాన్ని తమ గుప్పెట్లో పెట్టుకునే విధంగా జరుగుతున్న ప్రధాని నెతన్యాహు చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా 18వ వారం నిరసనలు కొనసాగాయి. ఎన్నడూ జరగని స్థాయిలో శనివారం భారీ ఎత్తున ప్రజాందోళన ఇజ్రాయిల్‌లో జరిగింది. రాజధాని టెల్‌అవీవ్‌లో లక్షల మంది వీధుల్లోకి వచ్చి తమ నిరసన గళాన్ని వినిపించారు. ఇజ్రాయిల్ ప్రజాస్వామ్యానికి ముప్పు వాటిల్లిందని ఆవేదన వ్యక్తంచేశారు. నీలం, తెలుపు రంగులతో ఉన్న జెండాలతో ప్రదర్శనలు నిర్వహించడం మూడు నెలలుగా ఇజ్రాయిల్‌లో కొనసాగుతోంది. కాగా టెల్ అవీవ్ నిరసనలో 1,10,000 మంది పాల్గొన్నట్లు ఇజ్రాయిల్ ఛానల్ 12 పేర్కొంది. దేశ వ్యాప్తంగా అన్ని ప్రధాన నగరాల్లో భారీ స్థాయిలో ఆందోళనలు, నిరసనలు జరిగినట్లు తెలిపింది. మా దేశం ఏమైపోతుందో అని భయమేస్తోంది. ఇది అవినీతిభరిత దేశంగా మారిపోకూడదన్నదే మా ఆవేదన అని 60ఏళ్ల టీచర్ ఒకరు అన్నారు. మరోవైపు ప్రభుత్వ వాదన ఇంకోలా ఉన్నది. న్యాయమూర్తులు పార్లమెంటు పాత్రను పెంచుతున్నారు కాబట్టే న్యాయవ్యవస్థకు ఎన్నికైన రాజకీయ నేతలకు మధ్య సమతుల్యత కోసం మార్పు తప్పదని చెబుతోంది. అయితే నెతన్యాహు ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. అధికారంలోకి వచ్చిన ఐదు నెలలు అయిన క్రమంలో జరిపిన ఓ సర్వే ప్రకారం ఈ ప్రభుత్వం పనితీరు అధ్వాన్నంగా ఉన్నదని 74శాతం మంది ప్రజలు నమ్ముతున్నట్లు వెల్లడైంది.

స్లోవేకియా ప్రధాని రాజీనామా

బ్రటీస్లావా: స్లోవేకియా ప్రధాని ఎడ్వర్డ్ హేగర్ ఆదివారం తన రాజీనామాను ప్రకటించారు. పదవి బాధ్యతల నుంచి తప్పించాలని అధ్యక్షుడు జుజానా కపుతోవాను కోరినట్లు తెలిపారు. మంత్రులు రాజీనామాలతో మంత్రిమండలి దాదాపు ఖాళీ అయింది. సెప్టెంబరులో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆపద్ధర్మ ప్రభుత్వం కొనసాగుతోంది. మంత్రుల రాజీనామాలతో పాలకపక్షం బహీనమైంది. దీంతో బాధ్యతల నుంచి తప్పుకోవాలని హేగర్ నిర్ణయించుకున్నారు. ఇదే క్రమంలో అధ్యక్షుడిని కలిసిన ఆయన తన స్థానంలో కొత్త ప్రధానిని ఎన్నుకోవాలని కోరారు.

ఖలిస్తాన్ కమాండర్ పంజ్వర్ కాల్చివేత

లాహోర్: ఖలిస్తాన్ కమాండర్, భారత్‌లో మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదుల్లో ఒకడైన పరంజిత్ సింగ్ పంజ్వర్ (63) పాకిస్తాన్, లాహోర్‌లో హత్యకు గురయ్యాడు. మార్నింగ్ వాక్ చేస్తున్న అతనిని ఇద్దరు వ్యక్తులు కాల్చిచంపినట్లు పాకిస్తాన్ పోలీసులు తెలిపారు. ఇతను ఖలిస్తాన్ కమాండో ఫోర్స్ -పంజ్వార్ గ్రూప్ నాయకుడు అని చెప్పారు. 2020 జులైలో చట్టవిరుద్ధ కార్యకలాపాల (నివారణ) చట్టం కింద భారత ప్రభుత్వం ఇతనిని ఉగ్రవాదిగా ప్రకటించింది. సాయుధ దుండగులు పంజ్వార్ సింగ్ తలపై కాల్చి చంపారని, ఆస్పత్రికి తరలిస్తుండగా అతను మరణించినట్లు పంజాబ్ ప్రావిన్స్ సీనియర్ పోలీస్ అధికారి తెలిపారు. పంజ్వర్ సెక్యూరిటీ గార్డు కూడా కాల్పుల్లో గాయపడ్డాడని, చికిత్స పొందుతూ మరణించాడన్నారు. ఐఎస్ఐ, మిలటరీ ఇంటెలిజెన్స్ (ఎంఐ), సరిహద్దు ఉగ్రవాద నిరోధక సంస్థ (సీటీడీ)తో పాటు పాకిస్తాన్ నిఘా సంస్థలు ఆ ప్రాంతాన్ని అధీనంలోకి తీసుకున్నాయని చెప్పారు. ఫిబ్రవరిలో పాకిస్తాన్‌లోని రావల్పిండిలో హిజ్బుల్ ముజాహిదీన్ కమాండర్ బషీర్ అహ్మద్ పీర్ కూడా కాల్చివేతకు గురికావడం విదితమే.

రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వాలు

యుద్ధప్రాతిపదికన పంట కొనుగోళ్లు: ముప్పాళ్ల డిమాండ్

విశాలాంధ్ర-మంగళగిరి: అధిక, అకాల వర్షాలతో వ్యవసాయ రంగం అతలాకుతలం అవుతోందని, కోతకొచ్చే సమయానికి మిర్చీ, మొక్కజొన్న, పసుపు, మామిడి, ఇతర వాణిజ్య, ఆహార పంటలను అసాధారణ రీతిలో రైతులు నష్టపోతున్నారని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు ఆందోళన వ్యక్తంచేశారు.మొక్కజొన్న 66వేల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేయాలనటం రైతులను మోసగించడమేనని అన్నారు. సీపీఐ మంగళగిరి కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ముప్పాళ్ల మాట్లాడారు. రాష్ట్రంలో అతి కీలకమైన వాణిజ్యపంటగా మొక్కజొన్న పంట ఉందని చెప్పారు. క్వింటా ధర రూ.1962 ఉంటే మార్కెట్లో రూ.2400 దాకా పోయిందని, వర్షాల కారణంగా మొక్కజొన్న కండెలు, గింజలు కల్లాల్లో ఉన్న వేలటన్నులను నష్టపోయి రైతులు అల్లాడిపోతున్నారన్నారు. మార్క్‌ఫెడ్ సకాలంలో కొనుగోలు చేయకపోవడమే ఇందుకు కారణమన్నారు. మార్చిలో ప్రభుత్వం టెక్నికల్‌గా జీవో ఇచ్చి ఆదేశాలు జారీ చేయటంలో ఆలస్యమైందన్నారు. గతేడాది కంటే ఈ సంవత్సరం అధికంగా మొక్కజొన్న వేశారని, అంటే దిగుబడి 17 లక్షల మెట్రిక్ టన్నులు కన్నా ఎక్కువగా రావచ్చన్నారు. అదానీ, అంబానీకి లేక మరో ప్రైవేట్ వ్యక్తులకు లక్షల టన్నులు నిల్వ పెట్టుకొనే అవకాశం మోదీ ప్రభుత్వం కల్పించిందని, దానికి రాష్ట్రంలోని జగన్ ప్రభుత్వం తాళం వేస్తుండటంతో ప్రైవేటు వ్యాపారులు ఆక్వా, ఫౌండరీ రైతులను పీల్చి పిప్పి చేసి కోటీశ్వరులవుతున్నారని విమర్శించారు. ఈ దశలో 66 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనాలంటే మిగిలిన మొక్కజొన్నని ఎవరు కొనుగోలు చేస్తారని ముప్పాళ్ల ప్రశ్నించారు.తక్షణమే ఈ జీఓను మార్చాలని, రైతు నుంచి చివరి గింజ వరకు తడిసిన గింజతో సహా ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు, ఆర్దల వెంకట్రామయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు వీరశైవ లింగాయత్ మద్దతు

కర్నాటక అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీజేపీకి గట్టి ఎదురుదెబ్బ

బెంగళూరు: త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న కర్నాటక రాష్ట్రంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. కర్నాటక వీరశైవ లింగాయత్ ఫోరం కాంగ్రెస్ పార్టీకి అధికారికంగా మద్దతు ప్రకటించింది. దీంతో బీజేపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. వీరశైవ లింగాయత్ జారీ చేసిన ఈ ప్రకటన రాష్ట్రంలోని కీలకమైన లింగాయత్‌ల ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ స్థానాన్ని బాగా బలోపేతం చేస్తుందని భావిస్తున్నారు. ఫోరమ్ తన మద్దతును తెలియజేస్తూ అధికారిక లేఖను విడుదల చేసింది. ఇది ఈ ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీకి గణనీయమైన ప్రోత్సాహాన్ని సూచిస్తుంది. కర్నాటకలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ మే 10వ తేదీన జరుగనున్నాయి. మొత్తం 224 నియోజకవర్గాలకు పోలింగ్ నిర్వహించనుండగా, మే 13 ఫలితాలు వెల్లడించనున్నారు. ఈ క్రమంలో అన్ని పార్టీలు అస్త్రాలు సిద్ధం చేసుకుంటున్నాయి. విజయం సాధించడానికి నియోజకవర్గ స్థాయిలో పర్యటిస్తూ ఆ దిశగా అడుగులు వేస్తున్నాయి. ఇక వీరశైవ లింగాయత్ వేదిక ఈ నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. అంతేకాకుండా బీజేపీ లింగాయత్‌లను అవమానించిందంటూ బహిరంగ లేఖలో పేర్కొన్నారు. బీజేపీ అవమానించడం తాము మరచిపోలేదంటూ. ఈ ఎన్నికల్లో బీజేపీకి వ్యతిరేకంగా పని చేయాలని కీలక నిర్ణయం తీసుకున్నారు. మే 5న ప్రముఖ లింగాయత్ నాయకుడు, కాంగ్రెస్ పార్టీ సభ్యుడు జగదీష్ షెట్టర్, రాబోయే ఎన్నికల్లో పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరుతూ లింగాయత్ సామాజికవర్గానికి చెందిన స్వామీజీలతో సమావేశం నిర్వహించారు. మాజీ ముఖ్యమంత్రి షెట్టర్‌కు ఇటీవల బీజేపీ టికెట్ నిరాకరించడంతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గతంలో బి.ఎస్.యడియూరప్ప నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వ హయాంలో ఉప ముఖ్యమంత్రిగా పని చేసిన లక్ష్మణ్ సవాది కూడా లింగాయత్ వర్గానికి చెందినవారే. కర్నాటక రాష్ట్రంలో ఎన్నికల ఫలితాలను రూపొందించడంలో లింగాయత్ ఓట్లు చాలా కాలంగా కీలక పాత్ర పోషిస్తున్నాయి. చారిత్రాత్మకంగా, గతంలో కమ్యూనిటీ బీజేపీకి బలమైన మద్దతును కనబరించింది. గణనీయమైన లింగాయత్ జనాభా ఉన్న ప్రాంతాలు తరచుగా కాషాయ పార్టీకి బలమైన కోటలుగా పరిగణించ బడుతున్నాయి. ఏది ఏమైనప్పటికీ, కర్నాటక వీరశైవ లింగాయత్ ఫోరమ్ ఇటీవల కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వడంతో రాజకీయ దృశ్యంలో చెప్పు కోదగ్గ మార్పు కనిపించవచ్చు. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లో గణనీయమైన మార్పులను తీసుకురాగలదు. ఉత్తర కర్నాటకలో, ముఖ్యంగా బెలగావి, ధార్వాడ్, గడగ్ జిల్లాల్లో లింగాయత్‌లు గణనీయమైన ఉనికిని కలిగి ఉన్నారు. వారు బాగల్‌కోట్, బీజాపూర్, గుల్బర్గా, బీదర్, రాయచూర్‌లలో కూడా గుర్తించదగిన జనాభాను కలిగి ఉన్నారు. అదనంగా, వారు బెంగళూరు, మైసూర్, మాండ్యాతో సహా దక్షిణ కర్నాటకలో గణనీయమైన ప్రాంతాల్లో నివసిస్తున్నారు, ఇక్కడ వారి సంఖ్య గణనీయంగా ఉంటుంది. ఈ సంఘం రాష్ట్రంలో కీలకమైన జనాభాగా పరిగణించ బడుతుంది. ఎందుకంటే వారి ఓటింగ్ ప్రాధాన్యతలు తరచుగా ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేస్తాయి. ఇదిలా ఉండగా, లింగాయత్ ప్రాబల్యం ఉన్న ప్రాంతాలలో వీరశైవ లింగాయత్ ఫోరమ్ తమకు మద్దతు ఇవ్వడంతో కాంగ్రెస్ పార్టీ గణనీయంగా లాభపడాలని భావిస్తోంది.

రాష్ట్రానికి తుపాను గండం

(మొదటిపేజీ తరువాయి)

బెంబేలెత్తుతున్నారు. ఇప్పటికే గత వారం రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ధాన్యం కళ్ళాల్లోనే తడిసిపోతోంది. తీసి ఆరబెట్టడానికి కూడా వీల్లేకుండా వర్షాలు పడుతున్నాయి. అలాగే మొక్కజొన్న మొలకలెత్తుతోంది. మిరప, అరటి, బొప్పాయి, మామిడి పంటలకు భారీ నష్టం వాటిల్లింది. ఈ నేపథ్యంలో అప్రమత్తమైన రాష్ట్ర ప్రభుత్వం నష్టనివారణకు ముందస్తు చర్యలు చేపడుతోంది.

21లోగా బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయాలి

న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ ఫెడరేషన్ (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ అరెస్టుకు డిమాండ్, రెజ్లర్ల ఆందోళనకు రాజకీయ-ప్రజా-రైతు సంఘాల మద్దతు పెరుగుతోంది. బ్రిజ్ భూషణ్ అరెస్టుకు ఈనెల 21వ తేదీ డెడ్‌లైన్ అని రెజ్లర్లకు సలహాలిచ్చే 31 మంది సభ్యుల కమిటీ తేల్చిచెప్పింది. ఆలోగా అరెస్టు చేయని పక్షంలో తగు విధంగా నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని ప్రభుత్వాన్ని హెచ్చరించింది. ఆందోళనను తీవ్రతరం చేస్తామని చెప్పకనే చెప్పింది. రెజ్లర్ల ఆందోళనకు ఖాప్, రైతు సంఘాలు తమ మద్దతుపు ప్రకటించాయి. ఆదివారం దీక్షా శిబిరానికి వెళ్లి నాయకులు సంఘీభావాన్ని తెలిపారు. బీకేయూ నేత రాకేశ్ తికైత్, ఖాప్ మహమ్ 24 చీఫ్ మెహర్ సింగ్, సంయుక్త కిసాన్ మోర్చా నేత బల్దేవ్ సింగ్ సిర్సా తదితరులు రెజ్లర్లను కలిశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తికైత్ మాట్లాడుతూ త్రివర్ణ పతాకానికి అవమానం జరిగిందని, దీనిని ఉపేక్షించేది లేదని అన్నారు. దీర్ఘకాల పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఇది రాజకీయయేతర పోరాటమని సిర్సా అన్నారు. బ్రిజ్‌భూషణ్ అరెస్టు కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలని సాగు చట్టాలపై పోరాడినట్లు పోరాటానికి నడుం బిగుస్తామన్నారు. గతంలో ఒకసారి పరీక్షించారు. ఇక మా సహనాన్ని పరీక్షించొద్దని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రతి ఖాప్ పంచాయత్ సభ్యులు రెజ్లర్ల శిబిరాన్ని రోజూ సందర్శించాలని నిర్ణయించినట్లు నాయకులు తెలిపారు. వారంతా పగలు రెజ్లర్లతో ఉండి, సాయంత్రం తిరిగి వెళతారని చెప్పారు. రెజ్లర్లకు బాహ్య మద్దతిస్తామని తికైత్ అన్నారు. ఈనెల 21న సమావేశాన్ని నిర్వహిస్తామని, ఈ సమస్యకు పరిష్కారానికి ప్రభుత్వం చూపలేకపోతే భవిష్యత్ కార్యాచరణను అదేరోజు నిర్ణయిస్తామన్నారు. అత్యవసర పరిస్థితి తలెత్తినా, రెజ్లర్లకు ఏదైన సమస్య వచ్చినా మొత్తం దేశం వారికి అండగా నిలుస్తుందని అన్నారు. ప్రపంచ చాంపియన్ వినీశ్ ఫోగాట్ కూడా తమ డిమాండ్లను పరిష్కరించని పక్షంలో ఆందోళన ఉధృమవుతుందన్న సంకేతాలిచ్చారు. ఆమె మాట్లాడుతూ '21వ తేదీ నాటికి పరిష్కారం లభించకపోతే పెద్ద నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుంది. ఇది మా పోరాటం. దీనిని ఎవరూ హైజాక్ చేయలేదు. అన్యాయానికి వ్యతిరేకంగా చేస్తున్న ఈ పోరాటానికి అంతా మద్దతిస్తున్నారు. వీరంతా మమ్మల్ని గౌరవిస్తారు. మర్యాదిస్తారు. మా పోరాటం అందరూ మహిళలకు అనుబంధమైనది. మద్దతుదారులంతా మాకు ఎంతో బలాన్ని ఇచ్చారు. పోరాటానికి మేము సిద్ధంగా ఉన్నాం' అని చెప్పారు. శిక్షణ, పోటీలకు దీర్ఘకాలం దూరంగా ఉండగలరా అన్న ప్రశ్నకు లేదని ఆమె బదులిచ్చారు. 'పోటీల్లో తప్పకుండా పాల్గొంటాం. మాకున్నది ఒకే ఒక్క డిమాండు. బ్రిజ్‌భూషణ్ అరెస్టు, విచారణ' అని వినీశ్ ఫోగాట్ తెలిపారు.

ఇదిలావుంటే, ఖాప్ నేతలు, రైతులు భారీ సంఖ్యలో దిల్లీకి చేరుకున్న క్రమంలో ఆర్ఏఎఫ్‌తో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. పంజాబ్, హరియాణా, దిల్లీ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి రైతు నేతలు రావడంతో టిక్రీ సరిహద్దు వద్ద పోలీసులు వారిని అడ్డుకున్నారు. ప్రైవేటు వాహనాలకు మాత్రమే అనుమతిస్తామని, ట్రాక్టర్లకు అనుమతి లేదన్నారు. తర్వాత బస్సులకు అనుమతిచ్చారు. తలపాగాలు, పంచెకట్టులో వందలాది మంది రైతులు రాజధానికి చేరుకోవడంతో రైతాంగ పోరాటం నాటి దృశ్యం మళ్లీ ఆవిష్కృతమైంది.

11 నుంచి 16 వరకు సభలు- పాదయాత్ర: ఎస్‌కేఎం, ఖాప్ నేతలు

రెజ్లర్లకు మద్దతుగా దేశవ్యాప్త నిరసనలు చేపడతామని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) పేర్కొంది. ఈ నెల 11 నుంచి 16వ తేదీ వరకు అన్ని రాష్ట్రాల రాజధానులు, జిల్లా, తాలూకా కేంద్రాల్లో సభలు, నిరసన ప్రదర్శనలు చేపడతామని తెలిపింది. అదే విధంగా హరియాణా ఖాప్‌లు కూడా రెజ్లర్లకు ప్రజా మద్దతును కూడగట్టేందుకు ఈనెల 11-16 తేదీల్లో హిసార్‌లోని హంసీ నుంచి ఝజ్జర్ జిల్లాలోని బహదూర్‌ఘర్ వరకు పాదయాత్ర నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పాదయాత్రలో రాష్ట్ర ఖాప్ నేతలు, రైతు నాయకులు, మహిళలు, విద్యార్థులు, సామాజిక సంఘాల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. యాత్ర ముగిసే బహదూర్‌ఘర్ వేదికగా హరియాణా, యూపీ, దిల్లీ, రాజస్తాన్‌కు చెందిన ఖాప్ నేతలతో రెజ్లర్లు సమావేశమై భవిష్యత్ కార్యాచరణ నిర్ణయిస్తారని వెల్లడించారు. బహదూర్‌ఘర్ పట్టణం దిల్లీ సరిహద్దులో ఉన్నది. 16న దిల్లీ వచ్చేందుకు తమ తరహా పాదయాత్రను చేపట్టాలని ఉత్తరప్రదేశ్ ఖాప్ నేతలకు హరియాణా ఖాప్‌లు పిలుపునిచ్చారు. సంయుక్త కిసాన్ మోర్చా కూడా సింఘూ సరిహద్దు మీదుగా దిల్లీకి రావాలని పిలుపునిచ్చింది. దీంతో 16న హరియానా, ఉత్తరప్రదేశ్, పంజాబ్, రాజస్తాన్ ప్రజలు పెద్దఎత్తున జంతర్ మంతర్‌కు చేరుకోనున్నారు.

నివేదిక వచ్చేంత వరకు ఆగండి: దర్యాప్తు నివేదిక వచ్చేంత వరకు ఆగండి. నేను ఏ తప్పు చేయలేదు అంటూ సంయుక్త కిసాన్ మోర్చా నాయకులకు బ్రిజ్‌భూషణ్ విన్నవించారు. ఈ మేరకు 25 నిమిషాల వీడియోను విడుదల చేశారు. 'మీరు దిల్లీకి రావద్దని చెప్పడం లేదు. రండి.. ఏమైనా చేయండి. దానికంటే ముందు మీ గ్రామాల్లోని మహిళా రెజ్లర్లను నా గురించి అడిగి తెలుసుకోండి. ఆపై నిర్ణయం తీసుకోండి. ఒకట్రెండు లేదా మూడు నెలల తర్వాత వెలువడే దర్యాప్తు నివేదికలో నేను దోషి కాదని తేలితే మీరు మీ చర్యలకు బాధకూడదు. చేతులు జోడించి వేడుకుంటున్నా అప్పటి వరకు ఆగండి. నేనే ఖాప్ పంచాయత్‌కు వస్తా. నేను దోషినైతే చెప్పులతో చచ్చేంత వరకు కొట్టండి' అని బ్రిజ్‌భూషణ్ రైతులను కోరారు.

బీజేపీ మద్దతుతోనే హింస

(మొదటిపేజీ తరువాయి)

ప్రయోజన వ్యాజ్యం (పిల్)ను దాఖలు చేసింది. అయితే మెయితే వర్గీయులకు ఎస్టీ హోదా కల్పనకు ప్రతిపాదనలే లేవంటూ మణిపూర్ హైకోర్టు మార్చి 27న ఇచ్చిన ఉత్తర్వులను సర్వోన్నత న్యాయస్థానంలో బీజేపీ ఎమ్మెల్యే దింగాంగ్లుంగ్ గాంగ్మే సవాల్ చేస్తూ పిటిషన్ వేశారు. ఈ పిటిషన్లను సీజేఐ చంద్రచూడ్, జస్టిస్ నరసింహా, జస్టిస్ పార్దివాలాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం సోమవారం విచారించనుంది.

'రాష్ట్రంలో దాడులకు అధికార ఇండియన్ పీపుల్స్ పార్టీ, బీజేపీ సంపూర్ణ మద్దతుంది. కేంద్రప్రభుత్వం కూడా మద్దతిచ్చింది. ప్రబలంగా ఉన్న వర్గానికి మద్దతిస్తూ భారత రాజ్యాంగానికి విరుద్ధంగా అలౌకిక అజెండా ప్రకారం దాడులకు ప్రణాళికలు రూపొందించింది. ఆధిపత్య వర్గీయులు 30 మంది గిరిజనులను చంపేశారు. మరో 132 మందిని గాయపర్చారు కానీ ఒక్క ఎఫ్ఐఆర్ కూడా నమోదు కాలేదు. పోలీసులదీ వారి పక్షమే కాబట్టి వారు ప్రేక్షక పాత్ర వహించారు. ఈ హత్యలపై దర్యాప్తు కూడా జరపలేదు.అందుకే అసోం మాజీ డీజీపీ హరేకృష్ణ దేకా నేతృత్వంలో సిట్ ఏర్పాటు చేసి మేఘాలయ రాష్ట్ర మానవహక్కుల కమిషన్ మాజీ చైర్మన్, ప్రధాన న్యాయమూర్తి తింలియాంన్‌థాంగ్ వైపేయి పర్యవేక్షణలో విచారణ జరిపించి గిరిజనులకు న్యాయం చేయాలని కోరుతున్నాం. గిరిజనులపై దాడులు చేసిన వారిని ఉపేక్షించొద్దు. గిరిజన ప్రాంతాలైన న్యూ లంబులేన్, చెకోన్, గేమ్స్ విలేజ్, పైటే వెంగ్, లంఫెల్, లంగోల్, మంత్రిపుఖ్రీ, చింగ్‌మైరోంగ్, దుల్హాలేన్, లంఘబాల్ ప్రాంతాల్లో ఉండే గిరిజనులకు తక్షణమే భద్రత కల్పించాలని కేంద్ర బలగాలకు ఆదేశాలివ్వాలని, ఘర్షణల్లో ధ్వంసమైన చర్చిల నిర్మాణానికి సూచనలు చేయాలని కోరుతున్నాం' అని న్యాయస్థానానికి ఫిర్యాదు చేసింది. ఈ పిల్‌ను న్యాయవాది సత్యమిత్ర దాఖలు చేశారు.

ఇదిలావుంటే మయితే వర్గీయులకు షెడ్యూల్డ్ తెగ (ఎస్టీ) హోదాపై మణిపూర్ హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ హిల్ ఏరియా కమిటీ చైర్మన్, బీజేపీ ఎమ్మెల్యే గాంగ్మే సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. మయితేల చేర్పింపుకు సంబంధించి కేంద్రప్రభుత్వం వద్ద ఎలాంటి ప్రతిపాదన పెండింగ్‌లో లేదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు అలాంటి ప్రతిపాదనను కేంద్రానికి పంపలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. మయితేలను ఎస్టీ హోదాపై నిర్ణయించేది రాష్ట్రమేనని, ఇటువంటి సిఫార్సులను పంపేలా రాష్ట్రాన్ని ఎవరూ బలవంతం చేయలేరని పిటిషన్‌లో పేర్కొన్నారు. అయితే మయితే వర్గీయుల ధిక్కరణ పిటిషన్ నేపథ్యంలో తమకు నోటీసులు జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ ఆయన వేరొక పిటిషన్ కూడా దాఖలు చేశారు.

కర్నాటకలో కాంగ్రెస్‌కే ఆధిక్యం

(మొదటిపేజీ తరువాయి)

ఎంపిక చేసిన 56 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ సర్వే నిర్వహించారు. ప్రతి నియోజకవర్గంలో మూడు పోలింగ్ స్టేషన్లను ఎంపిక చేశారు. ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో 20 శాంపిల్స్ తీసుకున్నారు. ప్రాంతం, కులం, వయస్సు, పురుషులు, స్త్రీలు, పేద-సంపన్నులు ఇలా తగు నిష్పత్తిలో ఉండేలా చూసుకుంటూ మొత్తం 3360 శాంపిల్స్ సేకరించారు. పీపుల్స్‌పల్స్ ప్రతినిధులు ప్రీపోల్ సర్వే కోసం ఏప్రిల్ 25 నుంచి మే 5వ తేదీ వరకు రాష్ట్రంలోని ఆరు ప్రాంతాలలోని అన్ని నియోజకవర్గాల్లో పర్యటించి ప్రధాన పార్టీలపై ఓటర్ల నాడిని అంచనా వేశారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోని ఓటర్లను ముఖాముఖిగా కలుసుకోవడంతోపాటు అక్కడ వివిధ వర్గాలతో చర్చించి ఏ పార్టీకి అనుకూలంగా ఉందో తెలుసుకుంది.

ముఖ్యమంత్రిగా ఎవరికి ప్రాధాన్యతిస్తున్నారని ఓటర్ల అభిప్రాయాన్ని కోరగా మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పక్షాన 42 శాతం మంది నిలిచారు. ప్రస్తుత ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మైకి 24 శాతం, మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామికి 17 శాతం, మాజీ సీఎం యెడియూరప్పకు 14 శాతం మంది, డీకే శివకుమార్‌కు 3 శాతం మంది అనుకూలంగా చెప్పారు. రాష్ట్రాభివృద్ధికి ఏ పార్టీ మెరుగైనది అని ప్రశ్నిస్తే కాంగ్రెస్‌కు 46 శాతం, బీజేపీకి 34 శాతం, జేడీ(ఎస్)కు 14 శాతం మంది ప్రాధాన్యతిచ్చారు. బీజేపీకి మరో అవకాశం ఇస్తారా అని ప్రశ్నించగా 53 శాతం ఇవ్వబోమని, 41 శాతం ఇస్తామని చెప్పగా 6 శాతం మంది ఏమీ చెప్పలేమని తెలిపారు.రాష్ట్రంలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదలై ఆయా పార్టీలు అభ్యర్థుల జాబితాలను ప్రకటించిన తరువాత మూడు ప్రధాన పార్టీలలో అసంతృప్తి, తిరుగుబాటులు భారీగా చోటుచేసుకున్నాయి. పార్టీలు విడుదల చేసిన మ్యానిఫెస్టోలలో అనేక వివాదాస్పద అంశాలున్నాయి. ప్రధాన పార్టీల ప్రచారంలో అధినాయకత్వంతో ప్రధాన నేతలు పాల్గొన్న సందర్భాలలో అనేక వివాదాస్పద ప్రకటనలు, అంశాలు, సవాళ్లు, ప్రతిసవాళ్లు చోటుచేసుకున్నాయి.

పార్టీ ప్రాధాన్యతలో మార్పులు

దీనికి సంబంధించి సర్వేలో మూడు ప్రధాన మార్పులను గుర్తించాం.రాష్ట్రంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడే అవకాశాలున్నాయని అత్యధికమంది భావిస్తున్నా, కాంగ్రెస్‌కు మెజార్టీ వచ్చే అవకాశాలున్నాయని అభిప్రాయ పడుతున్న వారి సంఖ్య కూడా పెరుగుతోంది. బీజేపీ మెజారిటీ సాధించవచ్చని అభిప్రాయపడుతున్న వారి సంఖ్య తగ్గుతోంది. కాంగ్రెస్‌కు ఓటు వేసే వారి సంఖ్య పెరుగుతోంది. మరోవైపు, బీజేపీ, జేడీ(ఎస్)కు ఓటు వేసే వారి సంఖ్య తగ్గుతూ వస్తోందని సర్వేలో తేలింది. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), కేఆర్‌పీపీ (జనార్థన్‌రెడ్డి నేతృత్వంలో పార్టీ) వంటి చిన్న పార్టీల, ఇతర ఇండిపెండెంట్ల ప్రభావం తక్కువగా ఉంది. వారు 1 నుంచి 3 సీట్లు మాత్రమే గెలుపొందే అవకాశాలున్నాయి.

వివిధ పార్టీల ప్రచార ప్రభావం: రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితి ప్రకారం కాంగ్రెస్ ప్రచారంలో ముందంజలో ఉంది. గాంధీ కుటుంబంతో సహా అగ్ర నేతలందరూ రాష్ట్రంలో ర్యాలీలు నిర్వహించారు. ప్రభుత్వ అవినీతి, అభివృద్ధి లేకపోవడం, నిరుద్యోగం, ధరల పెరుగుదల అంశాలను కాంగ్రెస్ ప్రధానంగా ప్రచారం చేస్తోంది. మరోవైపు ప్రచారంలో బీజేపీకొన్ని సవాళ్లను ఎదుర్కొంటోంది. ప్రజాకర్షణ ఉన్న ప్రధాన మంత్రి ఉత్సాహంగా రికార్డు స్థాయిలో ర్యాలీలలో పాల్గొన్నారు. బీజేపీ ఇతర అగ్రనేతలు అలిసిపోయినట్టు కనిపించారు. బీజేపీ ప్రచారంలో అనేక మార్పుచేర్పులు కనిపించాయి. ఆ పార్టీ మొదట జాతీయ అంశాలకు ప్రాధాన్యతివ్వగా, ప్రజల నుంచి సానుకూలత కన్పించకపోవడంతో స్థానిక అంశాలకు ప్రాధాన్యతిచ్చింది. తనపై దూషణలు చేస్తోందని కాంగ్రెస్‌ను లక్ష్యంగా చేసుకొనిప్రధాన మంత్రి ప్రచారం చేశారు. చివరగా బీజేపీ మతప్రాతిపదిక ప్రచారానికి ప్రాధాన్యత ఇచ్చింది, కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో బజరంగ్ దళ్‌పై నిషేధంపై భారీగా ప్రచారం చేసింది. 'కేరళా స్టోరీ' లవ్‌జిహాద్‌పై దృష్టి పెట్టింది. హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలవలే ఇక్కడ కూడా జాతీయ అంశాల కంటే స్థానిక అంశాలే ఎన్నికల్లో ప్రభావం చూపించే అవకాశాలున్నాయి. జేడీ (ఎస్) దక్షిణ కర్నాటకపైనే దృష్టి పెట్టి స్థానిక అంశాల ప్రచారానికే ప్రాధాన్యతిచ్చింది. ఈ వ్యూహం పార్టీకి ప్రయోజనం చేకూర్చే అవకాశాలున్నాయి.

హెల్ప్... హెల్ప్!

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మణిపూర్‌లో ఘర్షణలు, హింసాత్మక పరిస్థితుల నేపథ్యంలో అక్కడ చదువుకుంటున్న ఆంధ్ర ప్రదేశ్ విద్యార్థులు, ఇక్కడ ఉంటున్న వారి తల్లిదండ్రులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. మణిపూర్ ఎన్ఐటీ సమీపంలో ఆదివారం కూడా పేలుళ్ల సంభవించడంతో విద్యార్థులు ఎప్పుడు ఏం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటున్నారు. తమను తక్షణమే స్వస్థలాలకు చేర్చేలా ఏర్పాట్లు చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఫోన్‌లు, వాట్సప్‌ల ద్వారా స్థానికంగా ఉన్న వారి తల్లిదండ్రులకు, బంధువులకు, రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన అధికారిక వెబ్‌సైట్లకు తాము పడుతున్న ఇబ్బందులను తెలియజేస్తున్నారు. మణిపూర్ ఎన్ఐటీ సహా వివిధ విద్యాసంస్థల్లో చదువుకునే విద్యార్థులు మన రాష్ట్రానికి చెందిన వారు సుమారు 157 మంది ఉన్నట్లు రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. ఒక్క ఎన్ఐటీ క్యాంపస్‌లోనే సుమారు 150 మంది తెలుగు విద్యార్థులు ఉండగా, వారిలో 70 మంది వరకు ఆంధ్ర ప్రదేశ్‌లోని వివిధ జిల్లాలకు చెందిన వారు ఉన్నారు. గత మూడు రోజులుగా పేలుళ్లు జరుగుతున్నాయని, ఆహార పానీయాలకు కూడా ఇబ్బందిపడుతున్నామని ఎన్ఐటీ విద్యార్థులు వాపోయారు. అల్లర్ల కారణంగా బయట ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయని, దీంతో బయట నుంచి ఏమీ రాక తిండికి కూడా ఇబ్బంది పడుతున్నామని వారు కన్నీటి పర్యంతమవుతున్నారు. అక్కడ విద్యార్థులు పడుతున్న ఇక్కట్లను స్థానికంగా ఉన్న వారి తల్లిదండ్రులు రాష్ట్ర మంత్రులు, శాసనసభ్యులు, అధికారులు దృష్టికి తీసుకువెళ్లి, వారిని సాధ్యమైనంత త్వరగా తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని ప్రాథేయపడుతున్నారు. ఇప్పటికే తెలంగాణ, ఒడిశా ప్రభుత్వాలు వారి విద్యార్థులను స్వస్థలాలకు తరలించేందుకు ప్రత్యేక విమానాలు ఏర్పాటు చేశాయని, కానీ ఏపీ ప్రభుత్వం మాత్రం ప్రకటనలకే పరిమితమవుతోందని విద్యార్థులు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్యేక విమానంతో తరలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు

మణిపూర్‌లో అల్లర్ల కారణంగా చిక్కుకుపోయిన తెలుగు విద్యార్థులను సురక్షితంగా వారి స్వస్థలాలకు చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటోంది. ఇప్పటి వరకు దాదాపు 157 మంది ఏపీ విద్యార్థులు మణిపూర్‌లో చదువుతున్నట్లు గుర్తించారు. మరోవైపు మణిపూర్‌లోని తెలుగు విద్యార్థులు ఉన్న కళాశాలల్లో ఒక్కో కళాశాల నుంచి ఒక్కో విద్యార్థిని నోడల్ పాయింట్‌గా అధికారులు గుర్తించారు. వారి ద్వారా ఆయా కళాశాలల్లోని ఏపీకి చెందిన మిగిలిన విద్యార్థుల వివరాలను సేకరిస్తున్నారు. వీరిని ప్రత్యేక విమానం ద్వారా సొంత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. విద్యార్థులను ప్రత్యేక విమానంలో తరలించడానికి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. దీనికి సంబంధించి పౌర విమానయాన శాఖ అధికారులతో మాట్లాడుతున్నారు. ప్రత్యేక విమానం ద్వారా ఏపీ విద్యార్థులను తరలించడానికి పౌర విమానయాన శాఖ అంగీకరించింది. ప్రత్యేక విమానాన్ని ఎన్ని గంటలకు ఏర్పాటు చేస్తామన్న సమాచారంతో పాటు ఏ విమానంలో తరలిస్తామన్నది తెలియజేస్తామని పౌర విమానయాన శాఖ అధికారులు తెలిపారు. ఒకవైపు పౌర విమానయాన శాఖ అధికారులతో సంప్రదిస్తూనే ప్రైవేటు విమానయాన సంస్థలతోనూ అధికారులు మాట్లాడుతున్నారు. ప్రత్యేక విమానం ఏర్పాటుకు ఇండిగో విమానయాన సంస్థతో అధికారులు సంప్రదిస్తున్నారు.

సీఎస్‌కు చంద్రబాబు లేఖ

ఇంఫాల్‌లో తెలుగు విద్యార్థులను సురక్షితంగా ఇంటికి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలని టీడీపీ అధినేత చంద్రబాబు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాశారు. ఇంఫాల్‌లో చెలరేగిన హింస అక్కడ చదువుతున్న ఏపీ విద్యార్థులను ప్రమాదంలో పడేసింది. అక్కడి పరిస్థితుల కారణంగా తెలుగు విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల భద్రతపై ఆందోళన చెందుతున్నారు. భారత ప్రభుత్వంతో, అక్కడి స్థానిక అధికారులతో మాట్లాడి విద్యార్థులను సురక్షిత మార్గంలో వారిని ఇంటికి చేర్చడానికి చర్యలు తీసుకోవాలి. ఇంఫాల్ నుంచి ఆంధ్ర ప్రదేశ్‌కు ప్రత్యేక విమానాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులను తరలించాలి. విద్యార్థులు ఇంటికి తిరిగి తీసుకువచ్చే వరకు వారి సంరక్షణ, సౌకర్యం కోసం చర్యలు తీసుకోవాలి. విద్యార్థులకు ఆహారం, నీరు అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు.

విద్యార్థులతో ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పిన సీపీఐ నేత రామకృష్ణ

మణిపూర్‌లోని ఎన్ఐటీలో చదువుతున్న ఏపీ విద్యార్థులతో ఆదివారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఫోన్‌లో మాట్లాడి వారి ఇబ్బందులను తెలుసుకున్నారు. ఎన్ఐటీ కళాశాల వద్ద తెల్లవారుజామున పెద్ద పెద్ద శబ్దాలతో బాంబులు పేలాయని విద్యార్థులు తెలిపారు. బాంబు పేలుళ్ల వలన విపరీతంగా వచ్చిన పొగమంచుకు కొందరు విద్యార్థులు అపస్మారక స్థితికి వెళ్లారు. ఆహారం, మందులు, తాగు నీరు కూడా దొరక్క అక్కడ పడుతున్న ఇబ్బందులను తెలియజేయగా, తక్షణమే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మిమ్మల్ని స్వస్థలాలకు తరలించేందుకు కృషి చేస్తామని రామకృష్ణ వారికి ధైర్యం చెప్పారు. అనంతరం వెంటనే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి మణిపూర్‌లో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను, మరోపక్క విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల పరిస్థితిపై ఆందోళన చెందుతున్న తీరును వివరిస్తూ లేఖ రాశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక విమానం ఏర్పాటు చేసి మణిపూర్‌లో విద్యార్థులందరినీ తీసుకురావాలని కోరారు. తెలంగాణకు చెందిన విద్యార్థులను తీసుకువచ్చేందుకు ఆ ప్రభుత్వం ప్రత్యేక విమానం ఏర్పాటు చేయగా, ఏపీ ప్రభుత్వం ఇప్పటివరకు స్పందించకపోవడం విచారకరమని, ఇకనైనా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని కోరారు.

తక్షణమే తీసుకురండి : సీపీఎం నేత శ్రీనివాసరావు

మణిపూర్ రాష్ట్రంలో ఏర్పడిన ఘర్షణలతో, అత్యవసర పరిస్థితి కనిపిస్తే కాల్చివేత ఉత్తర్వులిచ్చారు. అక్కడ ఎన్ఐటీలో చదువుతున్న విద్యార్థుల పరిస్థితి దారుణంగా ఉంది. చాలా ఆందోళనతో ఉన్నారు. తెలంగాణా ప్రభుత్వం ఇప్పటికే ప్రత్యేక విమానాల ద్వారా తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తోంది. మణిపూర్‌లో సమాచార వ్యవస్థ అంతా ధ్వంసమైన నేపథ్యంలో తల్లిదండ్రులు ఇక్కడ తల్లడిల్లుతున్నారు. సీఎం జగన్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని మణిపూర్‌లో చదువుతున్న విద్యార్థులను తీసుకురావడానికి చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కోరారు.

మణిపూర్‌లోని మన వాళ్లను తెస్తాం

అకాల వర్షాల బాధిత రైతులను ఆదుకుంటాం : మంత్రి బొత్స

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: మణిపూర్ అల్లర్ల నేపథ్యంలో అక్కడున్న ఏపీకి చెందిన విద్యార్థులందరినీ తిరిగి తెచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. ఇప్పటికే 100 మంది నమోదు చేసుకున్నారని, ఇంకా ఎవరైనా వుంటే ప్రభుత్వ హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని సూచించారు. విజయనగరంలోని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి బొత్స మణిపూర్‌లో చిక్కుకున్న విద్యార్థుల సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. పౌర విమానయాన శాఖ మంత్రితో మాట్లాడి విద్యార్థులందర్నీ రాష్ట్రానికి రప్పించే ఏర్పాటు చేస్తున్నామన్నారు. బాధిత విద్యార్థులు హిమాన్షీ కౌశిక్, ఏపీ భవన్ 8800925668, రవిశంకర్, ఏపీ భవన్ ఓఎస్డీ 9871999055 నంబర్లకు సంప్రదించాలని సూచించారు. వివరాలు నమోదు చేసుకున్న వాళ్లని స్వస్థలాలకు చేర్చేలా ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని, ఇప్పటికే 100 మంది జాబితా సిద్ధమైందని, మరో 50 మంది ఉంటారన్న అంచనా ఉన్నదని చెప్పారు. ముగ్గురు సీనియర్ ఐఏఎస్ అధికారులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. అదే సమయంలో అకాల వర్షాలతో ఉత్తరాంధ్రలో పెద్దగా పంట నష్టం లేదని, అక్కడక్కడా మొక్కజొన్న, అరటికికి కొద్దిగా నష్టం వాటిల్లిందని చెప్పారు. మిగిలిన జిల్లాల్లో వివిధ పంటలకు జరిగిన నష్టాన్ని అంచనా వేస్తున్నామని, క్షేత్ర స్థాయిలో సిబ్బంది ఈ పనిలో నిమగ్నమయ్యారన్నారు. ప్రభుత్వం ప్రతి జిల్లాకి ప్రత్యేక అధికారిని నియమించిందని, వారు జిల్లాల వారీగా సమీక్ష చేసి, పంట నష్టాలు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు బాధ్యత ప్రభుత్వా నిదేనని అన్నారు. నష్టపోయిన ప్రతి రైతుని ఆదుకుంటామని భరోసానిచ్చారు. టెన్త్ ఫలితాలపై సంతృప్తిని వ్యక్తం చేసిన ఆయన వచ్చే ఏడాది టెన్త్, ఇంటర్ ఫలితాలను మరింత మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజు నియంత్రణకు తగిన యంత్రాంగం పనిచేస్తోందని, అధిక ఫీజులపై కమిషన్‌కి ఫిర్యాదు చేయొచ్చని సూచించారు. ప్రభుత్వ విద్యా రంగాన్ని అభివృద్ధి చేసి, మౌలిక సదుపాయాలను కల్పించడంతో పాటు విద్యా ప్రమాణాలను పెంచేందుకు విప్లవాత్మక మార్పులు తెచ్చామన్నారు. విద్యపై పెట్టే ఖర్చును రాష్ట్ర భవిషత్‌కు పెట్టుబడిగా ముఖ్యమంత్రి భావిస్తున్నారని మంత్రి బొత్స చెప్పారు.

అల్లూరికి భారతరత్న ఇవ్వాలి

జనసేన అధినేత పవన్ కల్యాణ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: నేటి తరం దేశవాసులందరికీ అల్లూరి సీతారామరాజు సంకల్పం, పోరాట పటిమ, ధీరత్వం, మృత్యువుకు వెరవని ధైర్యం... ఆయన జ్ఞాన-ఆధ్యాత్మిక సంపదల గురించి అందరికీ తెలియజేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకోవాలని, భారత రత్న ప్రకటించి ఆ పురస్కారానికి మరింత వన్నె అద్దాలని జనసేన అధినేత పవన్ కల్యాణ్ కోరారు. అల్లూరి జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా పెద్ద ఎత్తున నిర్వహించాలని, ఆయన స్ఫూర్తిని దేశమంతటికీ చాటాలని కోరారు. జనసేన అధికారంలోకి వస్తే ఆ బాధ్యతను తామే స్వీకరిస్తామని తెలిపారు. ఆ చైతన్యమూర్తి వర్ధంతి సందర్భంగా నా పక్షాన, జనసేన పక్షాన వినమ్రంగా అంజలి ఘటిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. 'వీరులకు పుట్టుకేగాని గిట్టుక ఉండదు. వారి చైతన్యం సదా ప్రసరిస్తూనే ఉంటుంది. వారు రగిల్చిన విప్లవాగ్ని సర్వదా జ్వలిస్తూనే ఉంటుంది. అటువంటి ధీరుడే మన మన్నెం వీరుడు అల్లూరి సీతారామ రాజు. ఆ మహా యోధుడు వీర మరణం పొంది నేటికీ వందేళ్లు. ఈ పుణ్య తిథినాడు ఆ విప్లవ జ్యోతికి భక్తి పూర్వకంగా ప్రణామాలు అర్పిస్తున్నాను. కారణజన్ములు తాము చేయవలసిన కార్యాన్ని పూర్తి చేసి అదృశ్యమైపోతారు. దాస్యశృంఖలాలతో అణగారి పోతున్న ప్రజలలో చైతన్యం రగల్చడానికి వచ్చిన శ్రీ సీతారామ రాజు, ఆ కార్యం నెరవేర్చి, నవ యువకుడిగానే మహాభినిష్క్రమణం గావించారు. సీతారామరాజు మన్యం ప్రజలలో రగిల్చిన విప్లవాగ్ని గురించి తెలుగు నేల నలు చెరగులకూ విదితమే' అని పవన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అల్లూరి ఆశయాల సాధనకు కృషి చేయాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు జేవీఎస్ఎన్ విజ్ఞప్తి

విశాలాంధ్ర- విశాఖ: స్వాతంత్ర్య సమర యోధుడు అల్లూరి సీతారామరాజు ఆశయాల సాధనకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు. అల్లూరి 99వ వర్ధంతి సందర్భంగా విశాఖలోని బీచ్ రోడ్‌లో ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి ఆదివారం ఆయన పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అల్లూరి వర్ధంతి సందర్భంగా పాల కులు పూలమాలలు వేసి నివాళులర్పిస్తే సరిపోదని, ఆయన ఆశయాల మేరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేయాలని అన్నారు. గిరిజనుల హక్కులను హరించే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. దేశవ్యాప్తంగా గిరిజన ప్రాంతాల్లో ఉన్న ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెప్పే మాటలకు, చేస్తున్న పనులకు పొంతన లేకుండా వ్యవహరిస్తున్నాయని విమర్శిం చారు. అల్లూరి శత వర్ధంతి కార్యక్రమాలను సీపీఐ ఏడాది పాటు నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం పైడిరాజు, కార్యవర్గ సభ్యులు ఎ విమల, పి చంద్రశేఖర్ నాయకులు జీఎస్‌జే అచ్యుతరావు, యు నాగరాజు, ఎ ఆదినారాయణ, జి రవిశేఖర్, బి శివప్రసాద్, ఎ రవి, ఎం శ్రీనివాసరావు, జి ఫణీంద్ర, కె సత్తిబాబు, రాంప్రభు, టీవీ రావు తదితరులు పాల్గొన్నారు.

యువతను మోసగిస్తున్న పాలకులు

ఈశ్వరయ్య విమర్శ

విశాలాంధ్ర-ఒంగోలు: కేంద్రంలో నరేంద్ర మోదీ అధికారంలోకి రాకముందు 2 కోటి ఉద్యోగాలు ఇస్తానని చెప్పి ఉద్యోగాలు ఇవ్వకుండా యువతను మోసం చేస్తున్నారని అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జాతీయ మాజీ కార్యదర్శి జి ఈశ్వరయ్య విమర్శించారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ప్రకాశం జిల్లా నిర్మాణ మహాసభ ఆదివారం ఒంగోలులోని మల్లయ్య లింగం భవన్‌లో పుట్టా సుబ్బారావు అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఈశ్వరయ్య మాట్లాడుతూ విద్య, వైద్యం, ఉపాధి సామాన్యులకు రాజ్యాంగం కల్పించిన హక్కనీ, ఈ హక్కును నరేంద్ర మోదీ ప్రభుత్వం విస్మరించి కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తోందని విమర్శించారు. తాను అధికారులకు వస్తే విదేశాల్లో మూలుగుతున్న నల్లధనాన్ని వెలికి తీసుకొచ్చి ప్రతి కుటుంబానికి రూ.15 లక్షలు ఇస్తానని చెప్పి నమ్మబలికి అధికారంలోకి వచ్చాక నల్లధనాన్ని కూడా చలామణిలోకి తీసుకొచ్చిన ఘనుడు మోదీ అన్నారు. తిరుమల తిరుపతి వెంకన్న సాక్షిగా ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తానని చెప్పి ఆ దేవునికే పంగనామం పెట్టినటువంటి అంథ భక్తుడు మోదీ అన్నారు. 36 మంది ప్రాణ త్యాగాల ద్వారా సాధించుకున్న విశాఖ ఉక్కును కార్పొరేట్లకు కట్టబెట్టే పనిలో మోదీ నిమగ్నమయ్యారన్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి రాజేంద్రబాబు , ఎన్ లెనిన్ బాబు మాట్లాడుతూ అధికారులకు వచ్చిన వెంటనే రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు లక్షల 30 వేల పోస్టులను భర్తీ చేస్తానని చెప్పి ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ రిలీజ్ చేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చాక ఉన్న ఉద్యోగాలు పీకేసే పనిలో ఉన్నారని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కసారి కూడా డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వలేదనీ, విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తానని చెప్పిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయకుండా ఏ విధంగా విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తారో తెలపాలని ప్రశ్నించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ జిల్లాలో యూనివర్సిటీ లేకపోవడం చాలా బాధాకరమనీ, దొనకొండలో పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేస్తామని చెప్పిన పాలకులు ఆ ఊసే మరిచారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం సుబ్బారావు, జిల్లా అధ్యక్షులు ఆర్ కరుణానిధి తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ నుంచి ఏఐటీయూసీలోకి...

విశాలాంధ్ర -చింతలపూడి: ఏలూరు జిల్లా చింతలపూడిలో 70 మంది అంగన్వాడీ కార్యకర్తలు సీఐటీయూ నుంచి ఏఐటీయూసీలో చేరారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు చలసాని రామారావు సమక్షంలో రాచప్రోలు మరియమ్మ, పి విజయలక్ష్మి, ఎస్ వెంకటేశ్వరమ్మ, వి సరోజినీ, పి మల్లేశ్వరి నాయకత్వంలో వారు ఏఐటీయూసీలో చేరారు. ఈ సందర్భంగా స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఏఐటీయూసీ చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షుడు టీ బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్ర మంలో చలసాని రామారావు ఏఐటీయూసీ కండువా వేసి వేసి వారిని సాదరంగా సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ అంగన్వాడి కార్మికులకు సమాన పనికి సమాన వేతనం కింద జీతాలు పెంచాలన్నారు. మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే విడుదల చేయాలన్నారు. వీరికి గ్రాట్యూటీఇచ్చి, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కో కన్వీనర్ చాట్ల పుల్లారావు, నియోజకవర్గ కార్యదర్శి కంకిపాడు బుచ్చిబాబు, చేతి వృత్తి దారుల సంఘం నాయకులు పుల్లూరి సోమశేఖరాచార్యులు, రైతు సంఘం నాయకులు దొంత కృష్ణ, నూజివీడు ఐసీడీఎస్ ఏఐటీయూసీ కార్యదర్శి క్రిస్టియనమ్మ, అధ్యక్షులు మారుమూడి విజయలక్ష్మి, తదితరులు పాల్గొ న్నారు. అనంతరం చింతలపూడి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అంగన్వాడి హెల్పర్స్ అండ్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ అనుబంధం) నూతన కమిటీని ఎన్నికైంది. గౌరవాధ్యక్షులుగా తొర్లపాటి బాబు, అధ్యక్షులుగా గంధంజమ్మ ఉపాధ్యక్షులుగా పులపర్తి విజయ లక్ష్మి, కార్యదర్శిగా రాచప్రోలు మరియమ్మ, సహాయ కార్యదర్శిగా పరిటాల మల్లేశ్వరి, కోశాధికారిగా వి. సరోజినీ, కమిటీ సభ్యులుగా ఎస్ వెంకటేశ్వరమ్మ, పసుపులేటి నాగమ్మ, పార్వతి, రాధా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఫీజుల నియంత్రణకు ప్రత్యేక చట్టం తేవాలి

విశాలాంధ్ర-విజయవాడ: కార్పొరేట్ ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణకు ప్రత్యేక ఆర్డినెన్సు ద్వారా చట్టం తీసుకురావాలని విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మలిరెడ్డి కోటారెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.నరహరి, రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ఆదివారం ముఖ్యమంత్రికి లేఖ రాశారు. కార్పొరేట్ ప్రైవేటు విద్యా సంస్థల ఫీజుల దోపిడీకి వ్యతిరేకంగా ప్రభుత్వం తెచ్చిన జీవో నెంబర్ 53, 54 అమలుకు సంబంధించి ప్రత్యేక ఆర్డినెన్స్ లేదా రాష్ట్ర శాసనసభలో ప్రత్యేక చట్టం చేసి అమలు చేయాలని కోరారు. 2022-23 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ అడ్మిషన్ల ప్రక్రియను ఆన్‌లైన్‌లో నిర్వహించేలా వెంటనే ఆదేశాలు జారీ చేయాలని, రిజర్వేషన్లు అమలు చేయాలని, రాష్ట్రంలో అన్ని స్థాయిల్లో మౌలిక వసతులతో కూడిన ఉత్తమ విద్య అందరికీ అందించాలని వారు కోరారు.

మన్యాన్ని కాపాడుకుందాం

అల్లూరి వర్ధంతి సభలో రాఘవులు

విశాలాంధ్ర-విశాఖ: అటవీ ప్రాంతాన్ని కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టే విధంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని, గిరిజనులను, మన్య ప్రాంతాన్ని కాపాడుకో వాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అల్లూరి స్ఫూర్తితో అందుకు కృషి చేయాలని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు పిలుపునిచ్చారు. అల్లూరి సీతారామరాజు 99వ వర్ధంతి సభను ఆదివారం విశాఖపట్నంలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ, ఆర్ఎస్ఎస్ విప్లవకారుడైన అల్లూరిని హిందుత్వవాదిగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. అల్లూరి ప్రాణ త్యాగం చేసి 99 ఏళ్లు గడిచిందన్నారు. 1884లో బ్రిటీష్ వారు తీసుకువచ్చిన అటవీ చట్టం ద్వారా గిరిజన ప్రజలు బ్రిటీష్ వారికి బానిసలు కావాల్సిన పరిస్థితిలో అల్లూరి ఆ చట్టానికి వ్యతిరేకంగా పోరాటం చేశారని వివరించారు. ఈ క్రమంలో అల్లూరి 1922-24 మధ్య సాయుధ పోరాటం నిర్వహించారని అన్నారు. అప్పటి బ్రిటీష్ చట్టం మాదిరి నేడు ప్రభుత్వాలు అటవీ సంరక్షణ చట్టం పేరుతో గిరిజనుల అటవీ భూములను కార్పొరేట్ శక్తులకు హైడ్రో ప్రాజెక్టులు, పర్యాటకం, మైనింగ్ అంటూ అటవీ ప్రాంతంలో అనుమతులు ఇచ్చారని తెలిపారు. అల్లూరి విజ్ఞాన కేంద్రం సాంస్కృతిక విభాగం బాధ్యులు జి.ఎస్.రాజేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గీతం కళాశాల ప్రొఫెసర్ చిన్నయ్య సూరి, సీఐటీయూ జాతీయ కోశాధికారి సాయిబాబు. ఏవీకే కార్యదర్శి బి.గంగారావు, ట్రస్ట్ సభ్యుడు ఎం.జగ్గు నాయుడు పాల్గొన్నారు.

రెజ్లర్ల ఆందోళనపై కేంద్రం స్పందించాలి

దిల్లీలో మహిళా రెజ్లర్ల ఆందోళన పై కేంద్రం ప్రభుత్వం స్పందించాలని రాఘవులు డిమాండ్ చేశారు. విశాఖలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదుగురు మహిళా రెజ్లర్లపై అఖిల భారత రెజ్లర్ల ఫెడరేషన్ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ సింగ్ లైంగిక వేధింపులకు పాల్పడ్డారని వారు ఆందోళన చేస్తుంటే కేంద్రం ఏ మాత్రం స్పందించటం లేదని విమర్శించారు. విచారణకు ఆదేశించకపోవడం విచారకరమన్నారు. దీనిపై దేశంలోని మిగతా క్రీడాకారులు స్పందించి సంఘీభావం తెలపా లన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణపై కేంద్రం మొండిగా వ్యవహరిస్తోందని విమర్శించారు.

పంట నష్టపరిహారం ఇవ్వాలి

విశాలాంధ్ర-పత్తికొండ: అకాల వర్షానికి పంట నష్టపోయిన రైతుకు నష్టపరిహారం చెల్లించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.రామ చంద్రయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ఏపీ రైతు సంఘం అధ్వర్యంలో అకాల వర్షానికి నష్టపోయిన వేరుశనగ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పత్తికొండకు చెందిన రైతు హరిజన రంగస్వామి నాలుగు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని రూ.2లక్షల పెట్టుబడితో వేరుశనగ సాగు చేచగా, పంట చేతికి వచ్చే సమయంలో ఇటీవల నాలుగు రోజులుగా కురిసిన అకాల వర్షాలకు పంట పూర్తిగా నష్టపోవడం జరిగిందన్నారు. నష్టపోయిన వేరుశనగ పంటకు ఎకరాకు 50వేల రూపాయలు ప్రభుత్వం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేసి 50% నిధులు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు కారన్న, పెద్ద ఈరన్న, నాయకులు గుండు బాష, ఎంకే సుంకన్న పాల్గొన్నారు.

జగన్ ఎక్కడ ఉంటే అక్కడ విధ్వంసమే

టీడీపీ నేత బుద్ధ వెంకన్న

విశాలాంధ్ర బ్యూరో - విశాఖ పట్నం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎక్కడ వుంటే అక్కడ సంక్షోభం, విధ్వంసం ఉంటాయని తెలుగుదేశం పార్టీ (టీడీపీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న అన్నారు. ఆదివారం టీడీపీ విశాఖ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 16,17,18 తేదీల్లో పెందుర్తి, ఎస్ కోట, అనకాపల్లిలో రాష్ట్రానికి ఇదేం ఖర్మ కార్యక్రమం జరుగుతుందని, అ కార్యక్రమంలో చంద్రబాబు నాయుడు పాల్గొంటారని చెప్పారు. జగన్ తాడేపల్లిలో కాపురం పెట్టిన తర్వాత విజయవాడ పెద్ద పల్లెటూరు అయిందని, ఇప్పుడు సెప్టెంబర్ నుంచి విశాఖలో కాపురం అంటున్నాడని అభివృద్ధి పథంలో ఉన్న విశాఖకు విజయవాడ పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో విశాఖ ప్రజలు వణికిపోతున్నారన్నారు. ఒక మాఫియాను తయారు చేయడానికి ప్రణాళికలో భాగమే డిఎస్పీల బదిలీలన్నారు.

కొత్తవలస-చొంపి వంతెనకు మోక్షం ఎప్పుడు?

- చినుకు పడితే రాకపోకలు బంద్
- గిరిజనులకు తప్పని అగచాట్లు
- పట్టించుకోని పాలకులు

విశాలాంధ్ర-అరకులోయ: అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ మండలం చొంపి, కొత్తవలస రహదారిలో గెడ్డపై ఉన్న వంతెన దశాబ్దాల కాలంగా ఆధునీకరణకు నోచుకోవడంలేదు. దీంతో వర్షాకాలంలో వంతెనకు అవతల ప్రాంతంలో ఉండే సుమారు పదివేల పై చిలుకు గిరిజనులు నానా అగచాట్లు పడుతున్నారు. వంతెన ఎత్తు తక్కువగా గెడ్డకు అనుకొని ఉండడంతో సాధారణ వర్షాలకే వంతెనపై నుంచి వరదనీరు ప్రవహించి రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఇక వర్షాకాలంలో అయితే వరద ప్రవాహానికి వంతెన కూలిపోతుందేమో నని గిరిజనులు భయపడుతున్నారు. ఈ సమయంలో రాకపోకలకు వీల్లేక పడరాని పాట్లు పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో అత్యవసర వైద్యం అవసరమైన రోగులు... ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితులు కూడా నెలకొంటున్నాయి. కొత్తవలస-చొంపి వంతెన ఒక పక్క సుమారు ఆరు పంచాయతీల ప్రజలు నివసిస్తున్నారు. వీరంతా ఏ పనికైనా ఈ వంతెనపై నుంచి అరకులోయ ప్రధాన కేంద్రానికి రావలసి ఉంటుంది. సంవత్సరాల తరబడి వంతెన అభివృద్ధికి నోచుకోక పోవడంతో అధికారులు, పాలకులపై గిరిజనులు మండిపడుతున్నారు. గతంలో కొత్తవలస వంతెన ఆధునీకరించాలని ఉన్నతాధికారులకు, పాలకులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని శిరగం, బస్కీ, చొంపి తదితర పంచాయతీల ప్రజలు వాపోతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో రెండు రోజులపాటు వంతెనపై నుంచి నీరు ప్రవహించింది. ఆసమయంలో వంతెన కూలి పోతుందేమోనన్న భయం వెంటాడిందని గిరిజనులు అంటున్నారు. ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు కొత్తవలస వంతెనపై దృష్టి సాధించి తక్షణమే ఆధునీకరణకు నిధులు మంజూరు అయ్యేలా చర్యలు చేపట్టాలని వర్షాకాలంలో వేలాదిమంది ప్రజలు పడుతున్న అగచాట్లకు స్వస్తి పలకాలని గిరిజనులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టుల మృతి

విశాలాంధ్ర- చింతూరు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలానికి సరిహద్దున ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఘటనలో ఎల్‌వోఎస్ కమాండర్ మడకం ఎర్రయ్య అలియాస్ రాజేష్‌తో సహా మరొక మావోయిస్టు మృతి చెందాడు. గత కొంత కాలంగా స్తబ్దుగా ఉన్న తెలంగాణ-చత్తీస్‌గఢ్ సరిహద్దు చర్ల అటవీ ప్రాంతంలో అలజడి నెలకొంది. పోలీసుల బూట్ల చప్పుళ్లు, తుపాకుల మోతతో దండకారణ్యం దద్దరిల్లింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని ఎర్రంపాడు, సరిహద్దు ప్రాంతం చత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా కిష్టారం-పుట్టపాడు అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే విశ్వసనీయ సమాచారంతో చత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా ఎస్టీఎఫ్ బలగాలు, చర్ల పోలీసుల అధ్వర్యంలో విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ నేపథ్యంలో మావోయిస్టులు తారసపడటంతో రెండు వైపులా కాల్పులు జరిగాయి. తొలుత పోలీసులు మావోయిస్టులను లొంగిపోవాలని ఆదేశించినా, పోలీసులపై మావోయిస్టులు కాల్పులకు తెగబడ్డారని, దీంతో పోలీసులు ఆత్మరక్షణ కోసం కాల్పులు జరపడంతో పోలీసుల కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందినట్లు, వారిని గుర్తించాల్సి ఉందని జిల్లా ఎస్పీ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. కాల్పుల ఘటనకు సంబంధించి విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు ఎల్‌వోఎస్ కమాండర్ మడకం ఎర్రయ్య అలియాస్ రాజేష్, చత్తీస్‌గఢ్‌కు చెందిన మరొక మావోయిస్టు సభ్యుడు మృతి చెందినట్లు తెలుస్తోంది. ఎన్‌కౌంటర్ బూటకమని మావోయిస్టు పార్టీ ఒక ప్రకటనలో తెలిపింది.

రేపు తెలంగాణా ఇంటర్ ఫలితాలు

విశాలాంధ్ర-హైదరాబాద్: ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాలు ఈ నెల 9వ తేదీన విడుదల కానున్నాయి. మంగళవారం ఉదయం 11 గంటలకు నాంపల్లిలోని ఇంటర్మీడియట్ బోర్డులో ఫలితాలను విడుదల చేయనున్నట్లు సమాచారం. రాష్ట్రంలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలు మార్చి 15వ తేదీ నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు నిర్వహించిన సంగతి తెలిసిందే. మొత్తం ఐదు లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహ నిర్మాణ సంఘం లిమిటెడ్
(Regd. No. AMC /KNA/DCO/2016/122)
డోర్ నెం: 54-16-3/3. ప్లాట్ సం: 48, రోడ్డు నెం. 3. లయోలా గార్డెన్స్, విజయవాడ-520008 ఫోన్: 0866-2452129,
e-mail: housing.emp@gmail.com, www.aphousingsociety.com

Notice. No. AGM / 1/2023-2024 Date: 05-05-2023

వార్షిక సర్వ సభ్య సమావేశపు నోటీసు

పై సొసైటీ వారి **2022-2023** ఆర్థిక సంవత్సరపు వార్షిక సర్వ సభ్య సమావేశము ది. **14-05-2023** ఆదివారం రోజున **ఉదయం 10.00 గం. నుండి మధ్యాహ్నం 1.00 గం. వరకు** శ్రీహరిపురం ప్రభుత్వ ఉద్యోగుల కాలనీ లే-అవుట్ స్థలం, కేతనకొండ గ్రామం, ఇబ్రహీంపట్నం మండలం, NTR జిల్లాలో జరుపుటకు నిర్ణయించబడింది. ఇప్పటికే సదరు మీటింగ్ నోటీసు (No. AGM/1/2023-2024, తేదీ:12-04-2023) ను సభ్యులందరకూ పోస్టు, వాట్సప్, e-maile ద్వారా తెలియపరచుటజరిగినది. సొసైటీ సభ్యులు యావన్మందికి మరొక్కసారి తెలియచేయునది ఏమనగా ఇట్టి సమావేశములో పాల్గొని సమావేశమును దిగ్విజయం చేయవలసినదిగా కోరడమైనది. మీటింగు అజెండాను సొసైటి website:www.aphousing society. com నందు చూడవచ్చును.

సం/-అడ్డాల సుబ్బరాజు
అధ్యక్షుడు

భాషల మధ్య ఆదాన ప్రదానాలు చర్చించిన 'రారా'

డా॥ తక్కోలు మాచిరెడ్డి, సెల్: 9666626546

అనువాద సమస్యలపై రాచమల్లు రామచంద్రారెడ్డి రాసిన పుస్తకానికి కేంద్ర సాహిత్య అకాడెమీ బహుమతి లభించింది. ఆయన మరణానంతరం ఇపుడు ఆ సమస్యలపై రారా అభిప్రాయం ఏమిటో కాస్త చూద్దాం. మొదట భాష గురించి. మనం మాట్లాడే భాష ఎన్నో పరిస్థితుల మీద ఆధారపడి ఉంటుంది. భాష అనేది ఒక జాతి జనులు సృష్టించుకునేది. ఆ జాతి నివసించే భూభాగపు శీతోష్ణస్థితులను, భౌగోళిక, సామాజిక స్థితిగతులను అనుసరించి దాని జీవిత విధానం ఉంటుంది. వీటన్నిటిని బట్టి దాని భాషా ఉంటుంది. యూరపులోని భౌతిక పరిస్థితులకూ, మన దేశ పరిస్థితికీ చాలా భేదం ఉంది. భాషల్లో కూడా ఇది ప్రతిబింబిస్తుంది.

ఈ సందర్భంగానే రారా భాషల మధ్య ఆదాన ప్రదానాలను గురించి చర్చిస్తాడు. మామిడిపండును తమిళంలో మాంగాయ్ అంటారు. ఈ పదమే ఇంగ్లీషులో Mango అయింది. అలాగే curry అనే ఇంగ్లీషు పదం తమిళ మూలం నుంచి వచ్చిందే అని చెబుతారు. తెలుగులోని అక్క చెల్లెలు అనే రెండు పదాలకు గాను ఇంగ్లీషులో sister అనే ఒక్క పదమే ఉంది. అలాగే అన్న, తమ్ముడు అనే రెండు పదాలకు బ్రదర్ అని ఒక్క పదమే ఉంది ఇంగ్లీషులో. మేము, మనము అనే రెండు పదాలకు ఇంగ్లీషులో we అనే ఒక్క పదమే ఉంది. మేనమామకు, చిన్నాన్నకూ కలిపి uncle అనే ఒక్క పదమే ఉంది వాళ్ల భాషలో. మానవ సంబంధాలు తెలిపే ఇన్ని మాటలు తెలుగులో ఉన్నందుకు మనం గర్వపడాలి. అంతెందుకు? కూర లేకుండా మనం అన్నం తినం. యూరపులో కూర అనేదే లేదు. సూప్ అంటారు. బ్రెడ్‌తో పాటే మాంసమూ, చేపలు, గుడ్లు, ఉర్లగడ్డలు, టొమాటోలు తింటారు. ఇదంతా వాళ్లకు భోజనమే.

దుస్తుల విషయంలో కూడ భేదాలున్నాయి. యూరప్‌లో చీర, రవిక, కొంగు, పైట అనేవి లేవు. హిందీ 'సాడీ' నుంచి sari అనే పదం ఇంగ్లీషులోకి వచ్చింది. పైటను ఇంగ్లీషులో చెప్పవలసివస్తే upper end of the sari అనో, shoulder end of the sari అనో సరిపెట్టుకోవాల్సి వస్తుంది అని అంటారు రారా. కొన్ని అభౌతికమైన భావాలకూ, అనుభూతులకీ కచ్చితమైన సమానార్థక పదాలు లక్ష్య భాషలో లేకపోవడం మనం గమనిస్తూ ఉన్నాం. pretty, beautiful, sorrow, pity, compassion, love, affection లకు తెలుగులో అందమైన, మనోహరమైన, దుఃఖం, జాలి, కరుణ, ప్రేమ, అనురాగం అనేవి స్థూలంగా సమానార్థకాలుగా అగుపిస్తాయి గానీ, తరచి చూస్తే, నూటికి నూరుపాళ్లు సమానార్థకాలు కావు. ఆ అమ్మాయి అందంగా ఉంది. బొమ్మలాగుంది అంటే, అమ్మాయి అందాన్ని మెచ్చుకోవడమవుతుంది. she is beautiful, but beautiful like a statue అన్నా, like a doll అన్నా ఆమె అందంగా ఉంది. కానీ జీవకళ లేదనే అర్థం వస్తుంది. లవ్ అంటే ప్రేమ కదా? కానీ, i love coffee అంటే నేను కాఫీని ప్రేమిస్తున్నాను అని కాదు కదా! కాఫీ అంటే నాకు మహా ఇష్టం అని అర్థం. మరో పదం serious ను తీసుకుందాం. దీనికి తెలుగులో ఒకే ఒక సమానార్థక పదం లేదు. serious, subject, serious problem, serious offence అన్నపుడు serious అంటే 'గురుతరమైన' అనే పదం సమానార్థకం. కాని, are you serious- అంటే, నీవు హాస్యానికి అనడం లేదు కదా అని అర్థం. రారా సీరియస్ అనే పదాన్ని సీరియస్‌గానే తీసుకొని, దాని నానార్థాల్ని, అర్థ ఛాయల్ని ఎత్తి చూపాడు. i warned him seriously- అంటే, నేను వానికి గట్టిగా హెచ్చరిక చేశాను. i was only joking, but he took it seriously. అంటే నేను హాస్యానికి అన్నాను, కాని అతను దాన్ని పూర్తిగా నిజమే అనుకున్నాడు. అని అనువదించాలి. seriously ill అంటే, తీవ్రంగా జబ్బుపడటం. serious injury అంటే, ప్రమాదకరమైన గాయం. to make serious attempt అంటే గట్టి ప్రయత్నం చేయడం. గట్టిగా కృషి చేయడం. you want divorce. are you serious – దీనికి సముచితమైన అనువాదం- నీకు విడాకులు కావాల్నా! నిజంగానా?! మరో మాట secular అనేది. secular state అంటే మతాతీత రాజ్యం అనవచ్చునంటాడు. రారా. secular పదానికి 'లౌకిక' అనేది సమానార్థకం. రారా యీ పదం ఇవ్వలేదు.

ఒకోసారి పదాల అర్థం మాత్రమే తీసుకుంటే పప్పులో కాలేసినట్లే. he has come at the wrong time అంటే తెలుగులో తప్పుడు కాలమనీ, చెడ్డ సమయమనీ అర్థం కాదు. అతను వేళకాని వేళ వచ్చినాడు లేదా అతను వేళ తప్పి వచ్చినాడు అనన్నా అనాలి. ఇక మంచి అనువాదం అని మనం దేన్ని అంటున్నాం? ఈ విషయంలో రెండు అభిప్రాయాలున్నాయి. మొదటి అభిప్రాయం ప్రకారం, అనువాదకుడు మైల రచన యొక్క అర్థాన్నీ, తాత్పర్యాన్నీ శ్రద్ధగా గమనించి, తద్వారా మూల రచయిత భావాలను నిర్దుష్టంగా, సమగ్రంగా గ్రహించి, ఆ భావాలను అత్యుత్తమంగా వ్యక్తం చేయాలి. రెండవ అభిప్రాయం ప్రకారం అలా వ్యక్తం చేయడమే కాకుండా మూల రచయిత శైలినీ, రచనా విధానాన్ని కూడా వ్యక్తం చేయాలి. అనుకరించాలి. మూలం లాగే సుబోధకంగా ఉండాలి అనువాదం.

రచనా శైలిని గురించి రారా నిశ్చిత అభిప్రాయం ఏమిటటంటే, భావాల సంపూర్ణత కొరకు శైలిని త్యాగం చెయ్యవచ్చు గానీ, సౌష్ఠవం కొరకు భావాలను త్యాగం చేయకూడదు అని. గమనించాల్సిన మరో అంశం ఏమిటటంటే, ఆలంకారిక శైలి గల రచనలను అనువదించడం కంటే భావాలను సరళంగా, సూటిగా వ్యక్తం చేసే భాషను అనువదించడం కష్టమని అభిప్రాయపడతాడు రారా. 'భారతదేశం ఆర్థికాభివృద్ధి' అనే శీర్షికన తెలుగు అకాడెమీ ప్రచురించిన ఇంటర్మీడియట్ పుస్తకంలోని ఒక ప్రకరణంలో ఇలా ఉంది. "రష్యా వంటి కమ్యూనిస్టు దేశాలలో బ్రిటన్ వంటి సోషలిస్టు దేశంలో"... అనే వాక్యం ఉందో బ్రిటన్‌ను ఎవరైనా ఎప్పుడైనా సోషలిస్టు దేశమని అన్నారా? ఇలా రాసే వాళ్లకు పాఠ్యగ్రంథ రచన బాధ్యత ఇచ్చినందుకు సిగ్గుపడాలి అని ఘాటుగా విమర్శిస్తాడు, అసహ్యించుకుంటాడు రారా.

ఇంగ్లీషు పదాలు అర్థంకాక, తప్పుడు అనువాదం చేసేవారు కొందరున్నారు. ఉదాహరణకు 'లెనిన్' అనే గ్రంథం అనువాదం చేసిన కేశవరెడ్డిగారు ఉన్నారు. Lenin is herited his father's tartar eyes అనే వాక్యాన్ని అనువదిస్తూ ఇలా రాశాడు. తండ్రిలా లెనిన్‌కు తాబేలు లాంటి చిన్ని కళ్లు సంక్రమించాయి. tartar అనే దాన్ని tartoise eyes అని పొరబడినాడు పాపం.

విజ్ఞాన్ అంటే హిందీలో సైన్సు అనే ఒకే అర్థం ఉంది. దీన్ని తప్పుపడుతూ విజ్ఞాన్ అంటే హిందీలో సంస్కృతి అని ఓ పెద్ద తప్పు చేస్తాడు రారా. గుంటూరు శేషేంద్రశర్మ తన కవిసేన manifesto లో కొన్ని Blunders ఉన్నాయని నిరూపిస్తాడు రారా. ఉదాహరణకు- Poet is the thief of fire...He is responsible for humanity- even for animals అని రెంబో అనే ఫ్రెంచి కవి అన్న మాటలు ఇచ్చి, వాటి మీద తాను ఇలా వ్యాఖ్యానించారు. "కవి అగ్ని దొంగ (అంటే కవి సమస్త మానవ సమాజ బాధల్ని దొంగిలించుకుపోయే దొంగ సుఖాన్నీ, గౌరవాన్నీ కీర్తినీ కాదు కవి సమస్తమానవ జాతికీ బాధ్యుడు- జంతు జాలానికి కూడా.) యూరోపియన్ సంస్కృతిలోనూ, పురాగాథల్లోనూ శేషేంద్రకు పరిచయం లేనందువల్ల ఘోరమైన ఈ తప్పు జరిగింది. అగ్ని దొంగ అంటే, గ్రీకు పురాణాల్లోని ప్రొమీథియస్ అనే వీరుడు. ఆదిమ కాలంలో మానవులకు అగ్ని తెలియదు. దేవతల దగ్గరే అగ్ని ఉండేది. ప్రొమీథియస్ దేవతల నివాసమైన ఒలింపస్ నుంచి అగ్నిని దొంగిలించి తెచ్చి మానవులకు ఇచ్చాడట. మరి, అగ్ని దొంగ అంటే మానవులకు మహోపకారం చేసిన ప్రొమీథియస్ అన్న మాట.

ఇకపోతే, Adge అంటే 'బాడిస' అని బ్రౌణ్యంలో ఉంది. తెలుగు అకాడెమీ ప్రచురించిన నిఘంటువులో ఇలా ఉంది. కట్టె ఉపరితలమును నరుకుటకు, చెక్క చేయుటకు ఉపయోగించు గొడ్డలి వంటి పనిముట్టు. దీనికి వాడియైన ఇనుప కత్తి ఉండును. ఇది పిడికర్రకు సమ కోణంలో ఉండును. Artery అంటే ధమని అని పాఠశాల విద్యార్థులకు కూడ తెలుసు. కాని, తెలుగు అకాడెమీ పండితుల నిర్వచనం ఇలా ఉంది. రక్తమును గుండెకాయ నుంచి శరీరంలోని వివిధ భాగములకు కొనిపోవునట్టి నాళము. అది ఒక పెద్ద అమరికలో భాగము. అలాగే, eyebrow అను మాటకు అకాడెమీ నిఘంటువులో ఇచ్చిన అర్థం- కంటి పైనుండు వెంట్రుకల వరుస. బ్రౌణ్యంలో కనుబొమ అని స్పష్టంగా ఉంది. కనుబొమ అనే మాట తెలియని విద్వాంసులను కన్నందుకు ఈ జాతి సిగ్గుపడదా?ఇదీ రారా ప్రశ్న.

Renato poggili అనే రచయిత అనువాదంపై రాస్తూ, ఆధునిక అనువాదకుడు ఆధునిక కళాకారులా స్వీయాభివ్యక్తి కోసం పరితపిస్తాడు. సమానుభేతి చెందుతాడు. నేడు ప్రపంచం కుగ్రామమైన వేళ, మన దేశంలోనే 250 భాషలు మాట్లాడే వారున్న స్థితిలో అనువాదం ప్రాముఖ్యం చాలా చాలా పెరిగింది. ప్రతి రాష్ట్రంలోనూ, ఒక అనువాద బ్యూరోను కేవలం అనువాదం కోసమె స్థాపించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. లాంఛనప్రాయంగా కాక వాటిని క్రియాశీలముగా ఉండేట్లు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాల మీద ఉంది. కాని, చదువంతా ఆంగ్లమయమౌతున్న ప్రస్తుత తరుణంలో ఇలా అనటం గొంతెమ్మ కోర్కె అవుతుందేమో అని నా భయం. రారా పుట్టినరోజు 28 ఫిబ్రవరి, 1922. అంటే నూరు సంవత్సరాలు అయిందన్న మాట.

సాహితి

అరసం బహుమతి పొందిన కవితలు-2023

తరుణమిదే...!!

సి.హెచ్.శ్రీకళ, సెల్: 7093757593

కొాదనగలవా?..వాతం కమ్మిన బాలింతలాంటి పుడమి తల్లిని ప్రకృతి వైపరీత్యాలేవో/
నిత్యమూ పొడుచుకు తింటుంటే..నెపమేదో వంచన ఎరుగని పంచభూతాలపై తోసేసి../
రాసుకున్న ఒప్పందాలూ..ఒడంబడికలూ నేడు వధ్య శిలపై వేలాడుతుంటే../
క్షిపణులు వాలుతున్న నేలపై ఇప్పుడిక నీకంటూ మిగిలేది నిశ్చల శ్మశాన వేదికనేనని..!/
కాదనగలవా?.. శివారు ప్రాంతాల మురికి బూడిద కుప్పల్లో చెదలు పట్టిన
అంకురమేదో లోనికి..లోలోనికి కుంగిపోతుంటే../

పొగ గొట్టాల విసర్జకాల విసురుకు సిమెంటు వృక్షాల కతీతంగా విస్తరించిన హరిత శ్వాసకోశాలు../
కరకు గొడ్డళ్ల ధాటికి వంటచెరకుగా ముక్కలు చెక్కలై ఆక్రందనలతో నేలకొరుగుతుంటే../
నీ ఖననానికైనా ఒక కట్టె కూడా దొరకని శూన్య శవపేటికలో నీవిప్పుడు నిర్జీవ దేహానివని..!/
కాదనగలవా?..తగులబడ్డ అమెజాన్ అడవుల పొత్తికడుపు కార్చిచ్చులో మాడిపోయిన../
లక్షల పక్షుల విశ్వ దుఃఖపు అశ్రు సమీక్షణను వేటాడిన శిఖండుడిగా../

కృత్రిమ మేధస్సుతో జినోమ్..క్లోనింగ్‌ల నీడన జబ్బలు చరుస్తూ విర్రవీగే నీ బోన్సాయ్ బతుకుకిక../
శాశ్వత చిరునామా నిర్జన ఎడారిలో నిర్వాసితమేనని..!/
స్వర్గారోహణం మొదటి మెట్టులోనే ఒరిగిపోయిన సహదేవుడిలా సాకునేదో నలగ్గొట్టకముందే../
సమ్మతిస్తావా?..మూలమిదేనంటున్న..మట్టిలా విస్తరించి
రాబోయే తరాలకికనైనా నాలుగు పచ్చని చెట్లను రాసివ్వాలని../
దిక్కులేని సముద్రంలో ఒంటరి కొయ్య పడవపైని చివరి పక్షొకటి
తప్పెవరిదంటూ తన రెక్కల తెరచాపనెత్తక మునుపే../
సమ్మతిస్తావా?..నదిలా బాహువులు చాచి పచ్చని పొదుగులా../
మన ఆకుపచ్చని స్వప్నాల్ని తలా దోసెడు కన్నీళ్లు పోసైనా సరే పండించుకోవాలని../
పరాజిత ఆక్రందనలా ప్రతిధ్వనించే "ఆ ఒక్క ఆకూ రాలక మునుపే..!"
సమ్మతిస్తావా?..లక్షల ఉల్కాపాతాల్ని మోస్తున్న ఆకాశంలోని గుడ్డి సూర్యునిలా మిగిలిపోక../
"తరుణమిదేనంటూ.."కోట్ల ప్రాణాల చక్రభ్రమణంలో కొన్ని వేలసార్లు మరణించైనా..
ప్రకృతి ప్రసాదించిన వరంగా../
'వృక్షాం దేహి..!" అంటున్న జీవనోత్సవపు మురిపాల పచ్చని కలనొకటిని../
విప్పార్చుకొనేందుకు ఇంకొక్కసారైనా పునర్ జన్మించాలని...!!!

(అరసం యువ వచన కవితా పోటీలు-2023 లో ప్రథమ బహుమతి పొందిన కవిత)

గ్రంథ సమీక్ష

స్వరాజ్య స్ఫూర్తికి అక్షరరూపం

చింతపట్ల సుదర్శన్

స్వాతంత్ర్యం సాధించిన భారత్‌కు 75 ఏళ్ల వయస్సు రావడాన్ని ఎంతో ఘనంగా జరుపుతామన్న సర్కారువారి పాట మొదట్లో కొంచెం ఘనంగానే వినిపించినప్పటికీ ఆ తర్వాత అంత ఘనంగా చెప్పుకోదగ్గ కార్యక్రమాలు దేశమంతటా జరిగినట్టు లేదు. మన వాళ్లు ప్రదర్శించే pseudo emotions లో దేశభక్తి ఒకటి కదా.అయితే ఈ సందర్భాన్ని పురస్కరించుకుని అక్కడక్కడ కొన్ని సంస్థల వారు సర్కారు వారి ప్రమేయం లేకుండా సాయం అందకుండానే కార్యక్రమాలు నిర్వహించాయి. వీటిల్లో పుస్తక ప్రచురణ ఒకటి. విశేషంగా చెప్పుకోదగ్గవి ఎక్కువగా లేకపోయినా "వెలుగు సాహితీ సంస్థ" విజయనగరం తరఫున వెలుగు రామినాయుడు ఆధ్వర్యంలో ప్రచురించిన 'స్వరాజ్య స్ఫూర్తి @ 75' గురించి తప్పకుండా చెప్పుకోవాలి. స్వతంత్ర పోరాటంలో సర్వస్వం త్యాగం చేసిన ప్రజా వాగ్గేయకారుడు గరిమెళ్ల సత్య నారాయణకి అంకితం యిచ్చిన ఈ సంపుటి దేశ స్వాతంత్ర్య అమృతోత్సవ స్ఫూర్తికి అక్షర రూపం కల్పించిన వ్యాస సంకలనం.

మాతృదేశ బానిస సంకెళ్లను ఛేదించడానికి ఎందరో మహనీయులు ప్రాణత్యాగం చేశారు. ప్రతి యేటా స్వతంత్ర దినోత్సవం జరుపుకునేటప్పుడు మన నాయకులు తమ మూస ఉపన్యాసాల్లో వేళ్ల మీద లెక్కపెట్టగలిగిన వారి వల్ల మాత్రమే స్వరాజ్యం సిద్ధించిందని చెప్పడం అలవర్చుకున్నారు. స్వతంత్రం కేవలం ఒక పార్టీ కారణంగానో, కొందరు వ్యక్తుల కృషి వల్లో వచ్చింది కాదని, అందుకు సంబంధించిన చారిత్రక సత్యాలను, వివిధ అంశాలను, నిస్వార్థంగా కృషి చేసిన అనేకులను గురించిన అవగాహనను ఈ తరానికి అందజేయవలసిన అవసరం ఉంది. ఆ అవసరాన్ని ఈ 'స్వరాజ్య స్ఫూర్తి ఏ 75' లోని వ్యాసకర్తలు ఒక బాధ్యతగా నిర్వర్తించారు. వ్యాసాలన్నిటిలో ఎంతో విలువయిన సమాచారాన్ని పొందుపరచడంతో పాటు దాటేస్తే దాగని సత్యాల్ని అనేక ఆసక్తికరమైన అంశాల్ని జోడించారు.



డా॥జయధీర్ తిరుమలరావు గరివెళ్లని ఎందుకు విస్మరించాంతో ఆరంభమై 'భారత స్వాతంత్ర్య పోరాటంలో గరిమెళ్ల పాత్ర' (రమాసుందరి) తో ముగిసే ఈ సంకలనంలో 21 వ్యాసాలు ఉన్నాయి.

ఈ వ్యాసాల్లో కొన్ని దేశ స్వతంత్ర ఉద్యమానికి సంబంధించిన చారిత్రక విషయాలను వివరిస్తే వర్తమాన దేశ పరిస్థితులను వివరిస్తూ భవిష్యత్తులో మార్పును కోరుకునే వ్యాసాలు కొన్ని. దేశ స్వాతంత్ర్య సాధనలో గాంధీజీ పాత్రను గాంధీ మార్గాన్ని డా॥నాగసూరి వేణుగోపాల్ వ్యాసం విపులీకరిస్తుంది. డా॥పాపినేని శివశంకర్, డా॥సి.హెచ్. సుశీలమ్మ, దివికుమార్, డా॥రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, డా॥కందిమల్ల సాంబశివరావు, కె.ఎల్.ప్రసాద్‌ల వ్యాసాలు స్వాతంత్ర్య ఉద్యమంలో దేశభక్తి కవిత్వం, పాట తెచ్చిన చైతన్యం, ప్రజాకళల పాత్ర, స్వరాజ్య భావనను వ్యాప్తి చేసిన నవల నాటకాలకు సంబంధించి తెలుగులో జరిగిన కృషిని విశ్లేషణాత్మకంగా అందిస్తాయి. స్వరాజ్య ఉద్యమంలో స్త్రీల పాత్రను డా॥జంధ్యాల కనకదుర్గ, కుప్పిలి పద్మ వ్యాసాలు, ఉద్యమంలో ఉత్తరాంధ్ర మహిళల పాత్రను డా॥కె.మధుసూదన్ వ్యాసం అక్షరీకరిస్తాయి.

ఫ్రెంచి విప్లవం కారణంగా స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే విలువల చైతన్యం రావడం, భారత రాజ్యాంగ సభ, అంబేద్కర్ నాయకత్వంలో డ్రాఫ్టింగ్ కమిటీ ఏర్పాటు, రాజ్యాంగంలో విశిష్టమైన ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు వంటివి డా॥బి.హరగోపాల్ వ్యాసం 'భారత రాజ్యాంగం- మారుతున్న సందర్భం' విశదీకరిస్తుంది. ప్రాంతీయ అస్తిత్వ ఉద్యమాల గురించి, స్వతంత్ర ఉద్యమంలో ఆంధ్రప్రదేశ్ ముస్లిమ్‌ల పాత్రను గురించి, కమ్యూనిస్టుల పాత్ర గురించి నందిని సిద్ధారెడ్డి, సయ్యద్ నశీర్ అహ్మద్, తెలకపల్లి రవిల వ్యాసాలు విపులీకరిస్తాయి.ప్రస్తుత దేశ ప్రధాన మంత్రి అంతరంగాన్ని, వ్యూహాల్ని, దేశ ప్రథమ ప్రధానమంత్రి నెహ్రూ ఆలోచనలనూ, విధానాలనూ కె.శ్రీనివాస్ వ్యాసం ఆవిష్కరిస్తే తెలుగు పత్రికల ఆవిర్భావాన్ని అవి నిర్వహించిన పాత్రను ప్రస్తావిస్తుంది ఆర్.వి.రామారావు వ్యాసం 'స్వాతంత్ర్యోద్యమంలో తెలుగు పత్రికలు: దశ-దిశ.

స్వతంత్రం సిద్ధించి 75 సంవత్సరాలయినా రైతు సమస్యలు పరిష్కారం కాలేదు. పోరాటాలు కొనసాగుతూనే ఉన్నాయి. విద్యారంగంలో అర్థంలేని ప్రయోగాలు జరుగు తున్నాయి కాని లోపాలు సరిదిద్దటం లేదు. ఇక ఆరోగ్య వ్యవస్థ ఎంత దయనీయమైన స్థితిలో ఉందో, రోజురోజుకీ ఎంత దిగజారిపోతున్నదో అందరికీ తెలుసు. ఈ అంశాల మీద అట్టాడ అప్పల్నాయుడు, రమేష్ పట్నాయక్, డా॥నళినిల వ్యాసాలు ఆలోచింపచేస్తాయి. 75 సంవత్సరాల స్వతంత్ర దేశంలో వర్తమాన పరిస్థితులు ఏమిటి, దిద్దుబాటు చేయవలసినదేమిటి అనే విషయాలు ఈ వ్యాసాలు చర్చిస్తాయి.

ఈ సంపుటిలోని వ్యాసాలన్నీ విస్తృతమైన పరిధిని కలిగి ఉన్నాయి. వ్యాసకర్తలందరూ అనుభవజ్ఞులైన రచయితలు. ప్రస్తుత పరిస్థితుల పట్ల అవగాహన, రాబోయేతరాల భవిష్యత్తు కోసం ఆరాటం ఉన్నవారే. వీరు వ్యాసాల్లో విషయాన్ని సులభంగా గ్రాహ్యం చెయ్యటంతో పాటు ఆసక్తికరంగా చెప్పడంతో ఈ వ్యాస సంపుటికి 'రీడబిలిటి' సమకూరింది. కొన్ని పుస్తకాలు చదివి మరచిపోతాం. కొన్నిటిని చాలాకాలం గుర్తుంచుకుంటాం. కొన్నిటిని చదివి గుర్తుంచుకోవడమే కాక ఇతరులను తప్పక చదవమని ప్రోత్సహిస్తాం. అలాంటిదే ఈ అమూల్యమైన వ్యాస సంకలనం. పఠనాసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ చదవడమే కాక గృహ గ్రంథాలయంలో భద్రంగా దాచుకోవలసినది ఈ స్వరాజ్య స్ఫూర్తి @ 75.

మే10న త్రిపురనేని శ్రీనివాస్‌తో ఓ సాయంకాలం!

ప్రముఖ కవి, అనువాదకుడు, విలక్షణ పాత్రికేయుడు, స్త్రీ, దళితవాదాల దారిదీపం, కవిత్వం ప్రచురణల ప్రచురణకర్త త్రిపురనేని శ్రీనివాస్ 60వ పుట్టినరోజు సందర్భంగా సాంస్కృతికశాఖ, కవి సంధ్య సయుక్త నిర్వహణలో 'త్రిపురనేని శ్రీనివాస్‌తో ఒక సాయంత్రం' కార్యక్రమం జరుగుతుంది.

మే 10, బుధవారం, సాయంత్రం 5.30 గంటలకు రవీంద్ర భారతి, కాన్ఫరెన్స్ హాలులో జరిగే ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ స్నేహితులు, అభిమానులు పాల్గొంటారు. కార్యక్రమంలో శ్రీనివాస్ జ్ఞాపకాల కలబోత, కవి సంధ్య పత్రిక-42, 'త్రి. శ్రీ ఏ60' ప్రత్యేక సంచిక ఆవిష్కరణ, కవిత్వం ప్రచురణలు ప్రదర్శన ఉంటాయి.

- కవి సంధ్య

ఆహ్వానం

ఎస్. ఎం. సుభాని కవితా సంపుటి

కాలంతో పాటు...

ఆవిష్కరణ

అధ్యక్షులు
సోమేపల్లి వెంకట సుబ్బయ్య
అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం

ఆవిష్కర్త
డా. సి. భవానిదేవి
ప్రముఖ కవయిత్రి

ఆత్మీయ అతిథులు
డా. భూసురపల్లి వెంకటేశ్వర్లు
హంస అవార్డు గ్రహీత
చలపాక ప్రకాష్
రమ్యభారతి సంపాదకులు

సమీక్షకులు
సారస్వత కళానిధి
డా. వెలువోలు నాగరాజ్యలక్ష్మి

14.05.2023 ఆదివారం
ఉదయం 10. గంటలకు

కొరటాల మీటింగ్ హాల్
2/7 బ్రాడీపేట, గుంటూరు.

గుంటూరు జిల్లా రచయితల సంఘం

చత్తీస్‌గఢ్‌లో మద్యం సిండికేట్

- ప్రతి సీసాపై అక్రమ సంపాదన
- రాష్ట్ర ప్రభుత్వాధికారులు, ప్రైవేటు వ్యక్తుల హస్తం
- వ్యాపారి అన్వర్ ధేబర్ అరెస్టు: ఈడీ

రాయ్‌పూర్: చత్తీస్‌గఢ్‌లో మద్యం సిండికేట్ నడుస్తోందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) వ్యాఖ్యానించింది. రాష్ట్ర ప్రభుత్వాధికారి, ఐఏఎస్ అనిల్ తుటేజా నేతృత్వంలో మద్యం వ్యాపారి అన్వర్ ధేబర్ కార్యకలాపాలు సాగిస్తున్నట్లు ఆరోపించింది. అక్రమ సంపాదన ఎన్నికల్లో వినియోగమవుతోందని తెలిపింది.ప్రతి మద్యం సీసాపై అక్రమ సంపాదన ఉంటోందని వెల్లడించింది. 2019 నుంచి 2022 వరకు రాష్ట్ర మద్యం అమ్మకాలలో దాదాపు 30-40శాతానికిపైగా అక్రమ పద్ధతిలోనే జరుగగా, రూ.1200 నుంచి రూ.1500 వరకు లాభాలు గడించినట్లు దర్యాప్తులో వెల్లడైందని ఈడీ తెలిపింది. చత్తీస్‌గఢ్‌లో లెక్కమించి మద్యం అక్రమ విక్రయాలు జరుగుతున్నాయని, సిండికేట్‌లో రాష్ట్రప్రభుత్వ ఉన్నతాధికారులు, ప్రైవేటు వ్యక్తులు, రాజకీయ ఎగ్జిక్యూటివ్‌లు భాగస్వాములుగా ఉన్నారని, రూ.2000 కోట్లకు మించి ఆర్జించారని పేర్కొంది. శనివారం అరెస్టు చేసిన అన్వర్ ధేబర్‌కు రిమాండ్ కోరుతూ రాయ్‌పూర్‌లోని ప్రత్యేక కోర్టులో చేసిన దరఖాస్తులో ఈ మేరకు ఈడీ పేర్కొంది. ఏడుసార్లు సమన్లు జారీ చేసినాగానీ అన్వర్ విచారణకు రాలేదని, బినామీ సిమ్‌కార్డులు, ఇంటర్నెట్ డాంగ్లేలు వాడుతూ లొకేషన్లు మార్చుతూ తిరిగాడని, రాయ్‌పూర్ హోటల్‌లో అతనిని పట్టుకున్నామని తెలిపింది. ఇతను కాంగ్రెస్ నేత, రాయ్‌పూర్ మేయర్ ఐజాస్‌కు అన్నయ్య అని, అనిల్ తుటేజా 2003 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అని, ఆయన రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ సంయుక్త కార్యదర్శి పదవిలో ఉన్నారని పేర్కొంది. అన్వర్‌కు మనీలాండరింగ్ నిరోధక ప్రత్యేక కోర్టు నాలుగు రోజుల రిమాండ్‌కు ఆదేశాలిచ్చింది. అయితే చత్తీస్‌గఢ్, రాయ్‌పూర్‌లోని అన్వర్ నివాసాన్ని, పశ్చిమ బెంగాల్, ఢిల్లీలోని 35 ప్రాంతాల్లో మార్చిలో జరిపిన తనిఖీలతో రూ.2 వేల కోట్ల మనీలాండరింగ్, అవినీతికి సంబంధించి ఆధారాలు లభించాయని, అక్రమ ఆదాయం బాధ్యత అన్వర్‌దేనని పేర్కొంది. అన్వర్ దుబాయ్‌లోని తన సహచరి వికాస్ అగర్వాల్ ద్వారా అక్రమంగా సంపాదించినదంతా యూఏఈలో పెట్టుబడులుగా పెడుతున్నట్లు ఈడీ ఆరోపించింది. చత్తీస్‌గఢ్ మద్యం విధానాన్ని ప్రస్తావిస్తూ రాష్ట్ర ఖజానాకు ఎక్సైజ్ సుంకం నుంచే ఎక్కువ సమకూరుతుందని తెలిపింది. రాష్ట్రంలో మద్యం ప్రొక్యూర్‌మెంట్ నుంచి రిటైల్ అమ్మకాలు మొత్తం రాష్ట్ర పరిధిలోనే సాగుతాయని పేర్కొంది. ప్రైవేటు మద్యం దుకాణాలకు అనుమతి లేదని, రాష్ట్రం అధ్వర్యంలో 800 దుకాణాలు ఉన్నాయని తెలిపింది. చత్తీస్‌గఢ్ రాష్ట్ర మార్కెటింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ (సీఎస్ఎంసీఎల్) కేంద్రంగా మద్యం సేకరణ జరుగుతుందని, డిస్టిలరీలు తమకు కేటాయించిన మార్కెట్ వాటా ఆధారంగా పర్సేంటేజీలను బట్టి లంచాలను చెల్లించినట్లు తెలిసిందని ఈడీ వెల్లడించింది. ఇదిలావుంటే, తన క్లయింట్‌పై చర్యలు రాజకీయ ప్రేరేపితమని అన్వర్ తరపు న్యాయవాది రాహుల్ త్యాగి పేర్కొన్నారు.

కేజ్రీవాల్ 'ప్యాలెస్' కోసం రూ.171 కోట్లు ఖర్చు

కాంగ్రెస్ ఆరోపణ

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ నివాసం కోసం ఖర్చు చేసిన మొత్తం రూ.171 కోట్లు అని, గతంలో నివేదించిన రూ.45 కోట్లు కాదని కాంగ్రెస్ పార్టీ ఆదివారం ఆరోపించింది. సీఎం నివాస సముదాయం విస్తరణ కోసం ఇళ్లు కూల్చివేయడం లేదా ఖాళీ చేయాల్సిన అధికారుల కోసం ఆయన ప్రభుత్వం అదనపు ఫ్లాట్లను కొనుగోలు చేయాల్సి వచ్చింది. కేజ్రీవాల్ సాధారణ జీవనశైలిని మోసగించారని, బదులుగా తన నివాసానికి కోట్లు ఖర్చు చేశారని కాంగ్రెస్ ప్రతినిధి అజయ్ మాకెన్ ఆరోపించారు. దీనికి భిన్నంగా ఢిల్లీలో నిరాడంబరతకు ప్రతిరూపం తమ పార్టీ నేత, మాజీ ముఖ్యమంత్రి షీలా దీక్షిత్ అని అన్నారు. '15 ఏళ్ల పాలనలో షీలా దీక్షిత్ కేబినెట్ మొత్తం తమ ఇళ్ల కోసం వెచ్చించిన మొత్తానికి అరవింద్ కేజ్రీవాల్ తన ప్యాలెస్ పునరుద్ధరణకు వెచ్చించిన మొత్తానికి సరిపోలేదు' అని మాకెన్ ఆరోపించారు. కేజ్రీవాల్ నివాసం కోసం ఖర్చు చేసిన మొత్తం రూ.45 కోట్లు కాదని, రూ.171 కోట్లు అని, అది కూడా కోవిడ్ మహమ్మారి సమయంలో ప్రజలు ఆసుపత్రి పడకల కోసం, ఆక్సిజన్ కొరత కోసం అల్లాడుతున్నప్పుడు అని ఆయన ఆరోపించారు. 'రూ.171 కోట్లు ఎలా ఖర్చు చేశారో నేను వివరిస్తాను. కేజ్రీవాల్ అధికారిక నివాసం పక్కనే 6, ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్, సివిల్ లైన్స్‌లో నాలుగు నివాస సముదాయాలు ఉన్నాయి. ఈ నాలుగు నివాస సముదాయాల్లో కలిపి 22 అధికారుల ఫ్లాట్లు ఉన్నాయి. ఈ 22లో 15 ఖాళీ లేదా కూల్చి వేయడం జరిగింది. మిగిలిన ఏడుగురికి, వాటిని తిరిగి కేటాయించబడదని సూచించబడింది' అని మాకెన్ చెప్పారు. ఈ ఫ్లాట్లను భర్తీ చేసేందుకు కేజ్రీవాల్ ప్రభుత్వం కామన్వెల్త్ గేమ్స్ విలేజ్‌లో రూ.126 కోట్ల విలువైన 21 టైప్-5 ఫ్లాట్లను కొనుగోలు చేసిందని అన్నారు. 'అందువల్ల ఈ 21 ఫ్లాట్ల ధరను కూడా కేజ్రీవాల్ నివాసం కోసం ఖర్చు చేసిన మొత్తంలో చేర్చాలి. ఎందుకంటే ఇది అతని నివాస విస్తరణ కారణంగా అవసరం' అని కాంగ్రెస్ నాయకుడు చెప్పారు. ప్రభుత్వం బడ్జెట్‌ను ఆమోదించింది. అయితే కేజ్రీవాల్ నివాసం పునరుద్ధరణ గురించి ప్రస్తావించనందున ఇది ప్రత్యేకాధికారాల ఉల్లంఘన సమస్య అని మాకెన్ వాదించారు. పునరుద్ధరణ వారసత్వం, పచ్చదనం మాస్టర్‌ప్లాన్‌ను కూడా విస్మరించిందని ఆయన ఆరోపించారు. కేజ్రీవాల్ 2015లో ముఖ్యమంత్రి అయిన తర్వాత సివిల్ లైన్స్ ప్రాంతంలోని 6 ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్‌లోని అధికారిక నివాసాన్ని ఆక్రమించుకున్నారు. ఈ నివాసంలో 5000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం కూడా ఉందని అధికారులు తెలిపారు. కేజ్రీవాల్ అధికారిక నివాసానికి రూ.45 కోట్లు ఖర్చు చేశారన్న ఆరోపణలపై రాజకీయ దుమారం చెలరేగుతోంది. కేజ్రీవాల్ అధికారిక నివాసంపై కోట్లాది రూపాయల ఖర్చు చేసిన ఆరోపణపై కాంగ్రెస్ గత నెలలో ఆమ్ ఆద్మీ పార్టీపై తీవ్ర దాడిని ప్రారంభించింది. ఇది 'అవమానకరం', అది తన ఓటర్ల ముఖం మీద చెంపదెబ్బ కొట్టినట్లుగా ఉందని పేర్కొంది.

ప్రధాని ఆరోపణలపై ఈసీ రుజువులు కోరగలదా?

న్యూఢిల్లీ: కర్నాటక ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేసిన ఆరోపణలకు ఎన్నికల సంఘం (ఈసీ) రుజువులు కోరగలదా? అని రాజ్యసభ సభ్యుడు, ప్రముఖ న్యాయవాది కపిల్ సిబల్ ఆదివారం ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. 'ఈసీ... బీజేపీపై అవినీతి ఆరోపణలకు కాంగ్రెస్ పార్టీ నుంచి ఆధారాలు కోరింది. మరి ఉగ్రవాదులతో సంబంధం ఉన్న వారితో కాంగ్రెస్ రాజకీయ చర్చలు జరిపిందన్న ప్రధాని ఆరోపణలకు ఆ అయన నుంచి రుజువు కోరుతున్నారా? ఈసీ ధైర్యం చేయలేదా?' అని సూటిగా ఈసీని ప్రశ్నించారు. 'కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు తీవ్రవాద సంస్థల ముందు మోకరిల్లింది. మనం చాలా కాలం హింసాకాండ కారణంగా బాధపడ్డాం. కాంగ్రెస్ ఈ దేశాన్ని ఉగ్రవాదం నుంచి ఎప్పుడూ రక్షించలేదు. కాంగ్రెస్ తన ఓటు బ్యాంకు కోసం ఉగ్రవాదానికి లొంగిపోయింది. అలాంటి పార్టీ కర్నాటకను రక్షించగలదా?' అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. కర్నాటకలో బీజేపీ ప్రభుత్వంపై చేసిన ఆరోపణలకు ఆధారాలను ఇవ్వాలని ఈసీ శనివారం కాంగ్రెస్‌కు నోటీసు జారీ చేసిన సంగతి విదితమే. ముఖ్యమంత్రితో సహా వివిధ స్థాయిల్లో కర్నాటక ప్రభుత్వంలో బీజేపీ 40 శాతం అవినీతికి పాల్పడిందని వార్తాపత్రికల్లో కాంగ్రెస్ పార్టీ జారీ చేసిన ప్రకటనలకు సంబంధిత ఆధారాలను ఇవ్వాలని ఈసీ ఆదేశించింది. ఆదివారం సాయంత్రం 7 గంటలలోపు కాంగ్రెస్ పార్టీ తన స్పందన వెల్లడించాలని కోరింది. ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి పార్టీలు ప్రచారాలను నిర్వహించుకోవాలని, సరైన ఆధారాలతోనే ప్రకటనలు ఇవ్వాలని ఎన్నికల సంఘం సూచించింది.

మణిపూర్‌లో తిరిగి సాధారణ స్థితి

- తాత్కాలికంగా కర్ఫ్యూ సడలింపు
- కొనసాగుతున్న సైనిక డ్రోన్లు, హెలికాప్టర్ల నిఘా
- 23 వేల మందిని రక్షించిన సైన్యం

ఇంఫాల్: సామాజిక వర్గాల మధ్య ఘర్షణలతో గత కొన్ని రోజులుగా అట్టుడికిన మణిపూర్‌లో క్రమంగా సాధారణ స్థితి నెలకొంటోంది. వైమానిక నిఘా కోసం మోహరించిన సైనిక డ్రోన్‌లు, హెలికాప్టర్ల నిఘా కళ్ల కింద చురాచంద్‌పూర్‌లో విధించిన కర్ఫ్యూను ఆదివారం తాత్కాలికంగా మూడు గంటల పాటు సడలించారు. అల్లర్లతో ప్రభావితమైన చురాచంద్‌పూర్ పట్టణంలో ఉదయం 7 నుంచి 10 గంటల వరకు కర్ఫ్యూ సడలింపు సమయంలో ప్రజలు ఆహారం, మందులు, ఇతర నిత్యావసర వస్తువులను కొనుగోలు చేయడానికి పెద్ద సంఖ్యలో బయటకు రావడం కనిపించింది. ఉదయం 10 గంటలకు కర్ఫ్యూ సడలింపు ముగిసిన వెంటనే సైన్యం, అస్సాం రైఫిల్స్ దళాలు పట్టణంలో కవాతు నిర్వహించాయి. మొత్తం 120-125 సైనిక బెటాలియన్లను రాష్ట్రంలో మోహరింపజేశారు. మణిపూర్‌లో దాదాపు 10 వేల మంది సైనికులు, పారా మిలటరీ, కేంద్ర పోలీసు బలగాలను మోహరించినట్లు ఆ వర్గాలు తెలిపాయి. మణిపూర్‌లో పరిస్థితిపై రక్షణ శాఖ ప్రతినిధి ఒకరు మాట్లాడుతూ 'సైన్యం గగనతల నిఘా వ్యవస్థను పెంచింది. ఇందుకోసం ఇంఫాల్ లోయలో డ్రోన్లను, హెలికాప్టర్లను మోహరించాం' అని తెలిపారు. శాంతియుత పరిస్థితులు అట్టడుగు స్థాయిలో అమలయ్యేలా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో శాంతి కమిటీలను ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి ఎన్.బీరెన్ సింగ్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం వివిధ వర్గాలతో చర్చలు జరిపిన తర్వాత చురాచంద్‌పూర్ జిల్లాలో పరిస్థితి కొంత మెరుగైందని ఆయన తెలిపారు. కాగా ఇప్పటి వరకు అన్ని వర్గాలకు చెందిన 23 వేల మంది పౌరులను రక్షించామని, వారిని సైనిక శిబిరాలకు తరలించామని రక్షణ శాఖ ఒక ప్రకటన చేసింది. షెడ్యూల్డ్ తెగ (ఎస్టీ) హోదా కోసం మైతేయి సామాజిక వర్గం డిమాండ్‌కు నిరసనగా రాష్ట్రంలోని 10 పర్వత ప్రాంత జిల్లాల్లో 'గిరిజన సంఘీభావ యాత్ర' నిర్వహించడంతో ఘర్షణలు చెలరేగాయి. మణిపూర్ జనాభాలో మైతేయిలు దాదాపు 53 శాతం ఉన్నారు. ఎక్కువగా ఇంఫాల్ లోయలో నివసిస్తున్నారు. అయితే గిరిజనులైన నాగాలు, కుకీలు జనాభాలో మరో 40 శాతం ఉన్నారు. వీరు ఎక్కువగా పర్వత జిల్లాల్లో నివసిస్తున్నారు. 'అన్ని వర్గాలలోని పౌరులను రక్షించడానికి, హింసను అరికట్టడానికి, సాధారణ స్థితిని పునరుద్ధరించడానికి గత 96 గంటలుగా అవిశ్రాంతంగా పని చేస్తున్న 120-125 బెటాలియన్ల సైన్యం, అస్సాం రైఫిల్స్ ప్రయత్నాల వల్ల పెద్ద హింసాత్మక నివేదికలు, కర్ఫ్యూ విధించవలసిన అవసరం లేని పరిస్థితి నెలకొంది. చురాచంద్‌పూర్‌లో ఆదివారం ఉదయం 7-10 గంటల వరకు సడలించింది. ఆ తర్వాత వెంటనే భద్రతా బలగాలు కవాతును నిర్వహించాయి' అని ప్రకటన పేర్కొంది. 'గత 24 గంటలలో సైన్యం వైమానిక నిఘా, యూఏవీల కదలిక, ఇంఫాల్ లోయలో సైనిక హెలికాప్టర్‌లను తిరిగి పంపడం ద్వారా నిఘా ప్రయత్నాలను గణనీయంగా పెంచింది. ఇప్పటి వరకు మొత్తం 23 వేల మంది పౌరులను రక్షించడం జరిగింది. వారిని సైనిక శిబిరాలకు తరలించాం' అని వివరించింది. ఇదిలాఉండగా, చురాచంద్‌పూర్‌లో మొదట మే 3న హింసాకాండ ప్రారంభమైంది. శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు గంటల పాటు కర్ఫ్యూ కూడా సడలించింది. 'చురాచంద్‌పూర్ జిల్లాలో శాంతిభద్రతల పరిస్థితి మెరుగుపడటంతో, రాష్ట్ర ప్రభుత్వం, వివిధ వర్గాల మధ్య చర్చలు జరిగిన తరువాత కర్ఫ్యూ పాక్షికంగా సడలించినందుకు సంతోషిస్తున్నాను' అని ముఖ్యమంత్రి ఎన్.బీరెన్ సింగ్ శనివారం రాత్రి ట్వీట్ చేశారు. హింసాత్మక రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితులపై అఖిలపక్ష సమావేశానికి అధ్యక్షత వహించిన తరువాత బీరెన్ సింగ్ మాట్లాడుతూ ఈ సమావేశంలో రాష్ట్రంలో శాంతి కోసం విజ్ఞప్తి చేయాలని, పౌరులందరినీ ప్రోత్సహించడానికి దారితీసే హింసాత్మక చర్యలను నివారించాలని నిర్ణయించడం జరిగిందని అన్నారు. ఈ సమావేశానికి కాంగ్రెస్, సీపీఐ, జేడీ(యూ), ఎన్‌పీఎఫ్, శివసేన, టీఎంసీ, బీఎస్‌పీ, ఆప్, ఎంపీపీ, ఏఐఎఫ్‌బీ, ఎంఎన్‌డీఎఫ్, ఏబీహెచ్‌కేపీ, మాజీ ముఖ్యమంత్రి ఒ.ఇబోబి సింగ్‌తో సహా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు.

అంబేద్కర్‌ను రాజ్యాంగాన్ని రాయమన్నది కాంగ్రెస్సే

- మేం ఏమీ చేయకుంటే మీరు ప్రధాని అయ్యేవారా?
- మోదీకి ఖర్గే చురకలు

కలబురగి: ప్రధాని నరేంద్రమోదీపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రధాని జాకెట్ మాత్రమే ప్రసిద్ధి చెందిందని, దానిని ఆయన రోజుకు నాలుగు సార్లు మారుస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇక్కడ జరిగిన బహిరంగసభలో ఖర్గే మాట్లాడుతూ... స్వాతంత్ర్య సంగ్రామంలో ఆర్‌ఎస్ఎస్, బీజేపీ పాత్ర గురించి ఖర్గే ప్రస్తావించారు. కాంగ్రెస్ వారు తమ ప్రాణాలను త్యాగం చేస్తున్నప్పుడు, ఆర్‌ఎస్ఎస్ నాయకులు ప్రభుత్వ పదవులు పొందడంలో తీరికలేకుండా ఉన్నారన్నారు. "గత 70 ఏళ్లలో కాంగ్రెస్ ఏం చేసిందో మోదీ చెబుతూనే ఉన్నారు. 'అరే భాయ్'... 70 ఏళ్లలో మేం ఏమీ చేయకుంటే మీరు ఈ దేశానికి ప్రధాని అయ్యేవారు కాదు. స్వాతంత్ర్యం తెచ్చుకున్నాం. మహాత్మా గాంధీ తన ప్రాణాలను పణంగా పెట్టి మనకు స్వాతంత్ర్యాన్ని అందించారు" అని ఖర్గే అన్నారు. "గాంధీజీ వల్లే గాంధీ 'టోపీ' ప్రసిద్ధి చెందింది... నెహ్రూజీ కారణంగా నెహ్రూ చొక్కా ప్రసిద్ధి చెందింది... కేవలం మీ (మోదీ) జాకెట్ మాత్రమే ప్రసిద్ధి చెందింది. మీరు ప్రతిరోజూ నాలుగు జాకెట్లు ధరిస్తారు - ఎరుపు, పసుపు, నీలం, కాషాయం... ఇప్పుడు అది 'మోదీ జాకెట్'గా ఫేమస్ అవుతోంది. ఎక్కడికి వెళ్లినా 'మోదీ-మోదీ' మాత్రమే. అరే! ఈ ప్రాంతానికి, దేశానికి మేలు చేయండి... కాంగ్రెస్‌ను దూషించడం వల్ల దేశం అభివృద్ధి చెందుతుందా?" అని ఖర్గే ప్రశ్నించారు. భారత రాజ్యాంగాన్ని రచించాలని డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను కాంగ్రెస్ కోరిందని ఆయన గుర్తు చేశారు. ఇది ఓటు హక్కుతో సహా ప్రజలకు సమాన హక్కులను ఇచ్చిందన్నారు. దళితులు, గిరిజనులు, ఇతర వెనుకబడిన వర్గాలు పంచాయతీ అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు అవుతున్నారంటే దేశానికి కాంగ్రెస్ ఇచ్చిన రాజ్యాంగమే కారణమని, 70 ఏళ్లకు ముందు ఇది సాధ్యం కాలేదని గుర్తుంచుకోవాలని మోదీనుద్దేశించి ఖర్గే అన్నారు. "దేశ స్వాతంత్ర్యం కోసం ఆర్‌ఎస్ఎస్ గానీ, బీజేపీ గానీ పోరాడలేదు... దాని కోసం పోరాడింది మనమే... మీరెవరూ (బీజేపీ/ఆర్‌ఎస్ఎస్) జైలుకు వెళ్లలేదు, మీ పార్టీకి చెందిన వారెవరూ ఉరికంబాలకు వెళ్లలేదు" అని ఖర్గే పేర్కొన్నారు.

ఆరోజుల్లో ఆర్‌ఎస్ఎస్ తన కార్యకర్తలకు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనమని చెప్పకుండా 'ఇతరులను స్వాతంత్ర్యం కోసం పోరాడనివ్వండి...మన కార్యకర్తల దృష్టి ప్రభుత్వ ఉద్యోగాలు పొందడంపైనే ఉండాలి' అని చెప్పిందని ఖర్గే విమర్శించారు. వారికి ప్రభుత్వ, మిలిటరీలో ఉద్యోగాలు లభించాయని, మంచి అవకాశాలున్న వెళ్లారని ఖర్గే పేర్కొన్నారు. కర్నాటక నుంచి ఎన్నికైన ఎంపీలు ప్రధానిని కలిసే అవకాశం రాకపోవడంతో రాష్ట్రానికి సంబంధించిన ఏ అంశాన్ని కూడా ప్రధాని వద్ద ప్రస్తావించలేకపోయారని ఖర్గే అన్నారు.

బెంగళూరులో మోదీ రోడ్‌షో

బెంగళూరు: కర్నాటక ఎన్నికల ప్రచారానికి గడువు సమీపిస్తున్న తరుణంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ వరుసగా రెండోరోజు ఆదివారం బెంగళూరులో భారీ రోడ్‌షో నిర్వహించి ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. న్యూ తిప్పసంద్ర రోడ్డులోని కెంపేగౌడ (బెంగళూరు వ్యవస్థాపకుడు) విగ్రహానికి మోదీ పూలమాలలు వేసి నివాళులర్పించడంతో ప్రారంభమైన రోడ్‌షో...తూర్పు, మధ్య బెంగళూరులోని దాదాపు అరడజను అసెంబ్లీ సెగ్మెంట్లను కవర్ చేస్తూ ట్రినిటీ సర్కిల్ వరకు 8 కిలోమీటర్ల మేర సుమారు గంటన్నరపాటు సాగింది. ప్రత్యేకంగా రూపొందించిన వాహనంలో ప్రధానమంత్రితో పాటు రాజ్యసభ సభ్యుడు, కేంద్ర సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్, బెంగళూరు సెంట్రల్ ఎంపీ పీసీ మోహన్ రోడ్‌షోలో పాల్గొన్నారు. రోడ్‌షో ముగిసిన ట్రినిటీ సర్కిల్ వద్ద, పెద్ద ఎత్తున గుమిగూడిన పెద్ద జనసమూహానికి మోదీ పదే పదే ముకుళిత హస్తాలతో నమస్కరించారు. శనివారం కూడా మోదీ రాష్ట్ర రాజధానిలో 26 కి.మీ. మేర రోడ్‌షో నిర్వహించారు. దక్షిణ, మధ్య బెంగళూరులోని కొన్ని ప్రాంతాల గుండా డజను అసెంబ్లీ సెగ్మెంట్‌లను కవర్ చేశారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు శనివారం ఒక్కరోజే ఎనిమిది గంటల పాటు జరగాల్సిన రోడ్‌షోను రెండు భాగాలుగా విభజించారు.

పది, ఇంటర్ పరీక్షల్లో యూపీ ఖైదీల ప్రతిభ

లక్నో: ఉత్తరప్రదేశ్ పదో తరగతి ఫలితాల్లో ఖైదీలు ప్రతిభచాటారు. 95 శాతం ఉత్తీర్ణత సాధించారు. 12వ తరగతి ఫలితాల్లో 70 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇటీవల జరిగిన పదోతరగతి పరీక్షలకు 60 మంది ఖైదీలు హాజరు కాగా, 57 మంది ఉత్తీర్ణులయ్యారని జైళ్లశాఖ తెలిపింది. వీరిలో కొందరు ప్రథమ శ్రేణి మార్కులు సాధించారు. 12వ తరగతి పరీక్షలకు 64 మంది ఖైదీలు హాజరు కాగా, 45 మంది ఉత్తీర్ణత సాధించారు. 16 మంది ఖైదీలు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారని తెలిపింది. అనేక కేసుల్లో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు 10, 12వ తరగతి పరీక్షలకు హాజరయ్యారై మంచి ఫలితాలు సాధించారని జైళ్ల శాఖ అధికారులు తెలిపారు. తమ జైళ్ల పరిధిలోనే ఎగ్జామినేషన్ సెంటర్లు ఏర్పాటు చేసి, పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా విద్యాశాఖ అధికారులకు సహకారం అందించామని తెలిపారు. మొత్తం 10 జైళ్లల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఖైదీలకు కావాల్సిన పుస్తకాలు సమకూర్చి, చదువుకునే వాతావరణాన్ని కల్పించామని చెప్పారు. పరీక్షలు జరుగుతున్న సమయంలో ఖైదీలకు ఎలాంటి పని కేటాయించకుండా, చదువునపై ధ్యాస పెట్టేలా చర్యలు తీసుకున్నామన్నారు.

కర్నాటకలో బీజేపీకి ఎదురుగాలి: శెట్టర్

బెంగళూరు: కర్నాటక ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, ఈ నెల 10వ తేదీన జరగనున్న శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలుపును ఎవరూ ఆపలేరని మాజీ సీఎం, బీజేపీకి రాజీనామా చేసి ఇటీవలే కాంగ్రెస్ పార్టీలో చేరిన జగదీష్ శెట్టర్ చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ప్రచారం ఎన్నికల్లో తమకు లాభిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఈసారి ప్రజల ఆశీస్సులు తనకున్నాయని, పెద్దసంఖ్యలో ప్రజలు తనకు మద్దతు ఇస్తున్నారని, తన గెలుపు ఖాయమని హుబ్లీ ధార్వాడ్ సెంట్రల్ నియోజకవర్గం నుంచి బరిలో నిలిచిన శెట్టర్ తెలిపారు. బీజేపీకి ఈ ఎన్నికల్లో భంగపాటు తప్పదని నొక్కిచెప్పారు. బీజేపీ టికెట్ ఆశించి భంగపడిన శెట్టర్ కాషాయ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. ప్రముఖ లింగాయత్ నేతలు శెట్టర్, లక్ష్మణ్ సవదిలు బీజేపీని వీడటంతో పాటు వీరశైవ లింగాయత్ సంఘం కాంగ్రెస్‌కు ఓటువేయాలని పిలుపు ఇవ్వడంతో బీజేపీకి గట్టి ఎదురుదెబ్బ తగలడం ఖాయమని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఇక అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ తేదీ దగ్గరపడుతుండటంతో ప్రధాన పార్టీల ప్రచారం క్లైమాక్స్‌కు చేరింది. అగ్రనేతలు ర్యాలీలు, రోడ్‌షోలు, బహిరంగ సభలతో ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. మే 10న కర్నాటక అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా 13న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటిస్తారు.

మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించాలి: శశిథరూర్

న్యూఢిల్లీ: అల్లర్లు, హింసతో అట్టుడుకుతున్న మణిపూర్ లో రాష్ట్రపతి పాలన విధించాలని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ డిమాండ్ చేశారు. సుమారు ఏడాది క్రితం బీజేపీని తిరిగి ఈ రాష్టంలో అధికారంలోకి వచ్చేలా చూసినందుకు తాము మోసపోయామని మణిపూర్ ప్రజలు ఆవేదన చెందుతున్నారని ఆయన అన్నారు.

"అక్కడ హింస ఇంకా ప్రజ్వరిల్లుతుండటంతో చాలా మంది భారతీయులు ఆలోచనలో పడ్డారు. గొప్ప పాలన అందిస్తామన్న ప్రభుత్వ వాగ్దానం ఏమైందని ప్రశ్నిస్తున్నారు. ఏడాది క్రితం బీజేపీకి అధికారం ఇచ్చిన మణిపూర్ ఓటర్లు తాము దారుణంగా మోసపోయామని ఇప్పుడు భావిస్తున్నారు. మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించేందుకు సమయం ఆసన్నమైంది. రాష్ట్ర ప్రభుత్వం తన బాధ్యత నిర్వర్తించడంలో విఫలమైంది" అని ఆయన ఆదివారం ట్వీట్ చేశారు. గిరిజనులు, గిరిజనేతరుల మధ్య ఘర్షణలు, అల్లర్లు, హింసాత్మక సంఘటనలతో దాదాపు వారం రోజులుగా మణిపూర్ భగ్గుమంటోంది. కనిపిస్తే కాల్చివేతకు గవర్నర్ ఆదేశించారు. సుపరిపాలన అందిస్తామంటూ అధికారం లోకి వచ్చిన బీజేపీ కారణంగా ఈ రాష్ట్రంలో ఇప్పుడేం జరుగుతోందో భారతీయులంతా తమను తాము ప్రశ్నించుకోవాలని శశిథరూర్ పేర్కొన్నారు. ఇప్పుడు ఈ రాష్ట్రంలోని ఓటర్లంతా తాము ద్రోహానికి గురయ్యామని బాధపడుతున్నారన్నారు. శాంతి భద్రతలు అదుపు తప్పిన మణిపూర్ లో రాష్ట్రపతి పాలన విధించవలసిన అవసరం ఏర్పడిందని ఆయన ఆదివారం ట్వీట్ చేశారు. రాష్ట్రంలో కుకీలు-మెయితీల మధ్య తలెత్తిన హింసపై సమీక్షించేందుకు మణిపూర్ సీఎం బీరెన్ సింగ్ శనివారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. తక్షణమే శాంతిని పునరుద్ధరించేలా చూసేందుకు ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. కాగా కేంద్రం నుంచి శనివారం మరో 20 కంపెనీల పారామిలిటరీ బలగాలు మణిపూర్ చేరుకున్నాయి. అల్లర్లు రేగిన ప్రాంతాలనుంచి సుమారు 20 వేలమంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ రాష్ట్రంలోని విద్యార్థులకు ఆదివారం నీట్ పరీక్షను నిర్వహించవలసి ఉండగా.. అల్లర్ల కారణంగా దాన్ని వాయిదా వేశారు. వారికి మరో తేదీన ఈ పరీక్ష నిర్వహిస్తామని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వానికి తెలిపింది. మణిపూర్ లోని రెండు కేంద్రాల్లో 8751 మంది అభ్యర్థులకు నీట్ పరీక్ష నిర్వహించాల్సి ఉంది.

రూ.50 వేలకు బాలిక విక్రయం నలుగురి అరెస్టు

రాయ్‌సేన్: మధ్యప్రదేశ్‌లో 17 ఏళ్ల బాలికను విక్రయించిన కేసులో నలుగురు నిందితులను పోలీసులు అరెస్టుచేశారు. అదనపు పోలీసు సూపరింటెండెంట్ అమృత్ మీనా తెలిపిన వివరాల ప్రకారం... మాండ్లా జిల్లాలోని ఘుఘ్రీ పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన బాలిక, జబల్‌పూర్‌లోని ఒక డెయిరీలో పని చేస్తోంది. అక్కడ ఆమెకు నిందితులలో ఇద్దరు... పహల్‌వతి బాయి, సునీల్ కుష్వాహా కలిశారు. ముంబైలో మంచి ఉద్యోగం ఇప్పిస్తామంటూ వీరిద్దరూ నమ్మబలికారు. తర్వాత ఆ అమ్మాయిని ఇద్దరు నిందితులు రైసెన్ జిల్లాలోని పటాయ్ గ్రామానికి తీసుకొచ్చారు. అక్కడ వారు ఆ అమ్మాయిని రూ. 50వేలకు విష్ణు కుష్వాహ అనే వ్యక్తికి వివాహం చేసుకోవడానికి విక్రయించారు. కాగా ఈ సంగతి తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో బాలిక విక్రయంలో ప్రమేయం ఉన్న నలుగురు నిందితులను శనివారం అరెస్టు చేశారు. మండల పోలీసులు అందించిన సమాచారం మేరకు నిందితులను పటాయ్ గ్రామంలో అరెస్టు చేసినట్లు డియోరీ పోలీస్ స్టేషన్ సబ్‌ఇన్‌స్పెక్టర్ శ్రద్ధా ఉయికే తెలిపారు. బాలికను మండల పోలీసులకు అప్పగించినట్లు ఆమె వెల్లడించారు.

ఫీజు చెల్లించనందుకు శిక్ష

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

థానే: పాఠశాల ఫీజు చెల్లించనందుకు ఓ ఉపాధ్యాయుడు కొంతమంది విద్యార్థులను శిక్షించిన ఉదంతం మహారాష్ట్రలో చోటుచేసుకుంది. గత ఏడాది 19న ఇక్కడి ఒక ప్రైవేట్ పాఠశాలలో 6వ తరగతి ఉపాధ్యాయుడు విద్యార్థులను తమ నోట్‌బుక్‌లలో 'రేపు నా ఫీజు కట్టడం మర్చిపోను' అని 30 సార్లు రాయమని అడిగాడు. ఉపాధ్యాయుడు విద్యార్థులను రాయమని అడిగిన నోట్ క్లిప్ సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో తల్లిదండ్రులు నిరసన ప్రారంభించారు. కాగా థానే మునిసిపల్ కార్పొరేషన్ (టీఎంసి) దీనిని తీవ్రంగా పరిగణించింది. మున్సిపల్ కమిషనర్ అభిజిత్ భంగర్ పాఠశాలను సందర్శించి ఈ విషయంపై విచారణ జరపాలని విద్యా అధికారిని ఆదేశించారు. దీంతో విద్యాశాఖ అధికారి విచారణ జరిపి పాఠశాల యాజమాన్యం ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసినట్లు టీఎంసీ ఒక ప్రకటనలో తెలిపింది. విద్యా హక్కు చట్టం ...పాఠశాల విద్యార్థులు మానసిక లేదా శారీరక వేధింపులను ఎదుర్కొనే పరిస్థితులను సృష్టించడం నిషేధించబడింది, పౌర ప్రకటన తెలిపింది. ఇలాంటి పరిస్థితి పిల్లల మనస్సులపై తీవ్ర ప్రభావం చూపుతుందని, పాఠశాలలు దీనిపై అవగాహన కలిగి ఉండాలని టీఎంసీ పేర్కొంది.

పసుపు రైతుకు పుట్టెడు కష్టం

- దెబ్బతిన్న పంటని పరిశీలించిన ఏపీ రైతు సంఘం ప్రతినిధి బృందం
- రాష్ట్ర ప్రభుత్వం రైతులను తక్షణమే ఆదుకోవాలి : కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర-కొల్లూరు: అకాల వర్షాలతో పంటలను నష్టపోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న రైతాంగాన్ని తక్షణమే ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వేమూరు నియోజకవర్గంలోని కృష్ణానది పరివాహక లంక గ్రామాల్లో ఆదివారం ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం ప్రతినిధి బృందం పర్యటించి దెబ్బతిన్న పసుపు, మొక్కజొన్న పంటల ఉత్పత్తులను పరిశీలించి రైతాంగాన్ని ఓదార్చారు. తమకు వచ్చిన కష్టం... జరిగిన నష్టాన్ని రైతాంగం ప్రతినిధి బృందానికి వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ వాణిజ్య పంటలకు నిలయమైన నియోజకవర్గంలోని కృష్ణానది పరివాహక లంక గ్రామాలైన వెల్లటూరు, చింతమోటు, పెసర్లంక, పెదలంక, కిష్కింద పాలెం, పెదపులివర్రు తదితర గ్రామాల్లో పర్యటించడం జరిగిందన్నారు. ఎకరాకు రూ.1.50 లక్షలు ఖర్చు చేసి పసుపు పంటను సాగు చేస్తే పంట దిగుబడులు సగటున 3 క్వింటాళ్లు కూడా వస్తాయో, రావోనన్న అయోమయ పరిస్థితుల్లో రైతులు ఉన్నారని ఆయన అన్నారు. పసుపు పంటకు ధర లేక అల్లాడుతున్న రైతాంగానికి మరోవైపు తడిసిన పసుపు కొమ్ములు కొనుగోలు చేస్తారో లేదోనని ఆందోళన చెందుతున్నారని ప్రసాద్ చెప్పారు. పంటను కొనుగోలు చేసేందుకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు చెబుతుండగా మరోవైపు తడిసిన పసుపు కొమ్ముల్లో కుర్కుమెంట్ శాతం తక్కువగా ఉందని, అలాంటి కొమ్ములను కొనుగోలు చేయడం సాధ్యం కాదని మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి చెబుతున్నారని అన్నారు. దీంతో ఎవరి మాటలు నమ్మాలో నమ్మకూడదో తెలియని పరిస్థితుల్లో రైతులు కొట్టుమిట్టాడుతున్నారని తెలిపారు. పంటలు దెబ్బతిని పీకల్లోతు అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతాంగాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక, ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోతున్న రైతులు వ్యవసాయాన్ని కాదని ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకుంటే రాష్ట్ర ప్రజలు తిండికి అల్లాడవలసి వస్తుందన్న విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి పసుపు పంటకు ఎకరాకు రూ.లక్ష పరిహారంతో పాటు పంటల బీమా పథకాన్ని అందించాలని కేవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న పంటను కొనుగోలు చేసేందుకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని అన్నారు. అయితే రాష్ట్రంలో ఈ ఏడాది 17 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న ఉత్పత్తులు వస్తాయని అంచనా ఉండగా కేవలం 66 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేయాలని ఆ ఉత్తరంలో పేర్కొనడం రైతును మోసగించటం కాక మరి ఏమిటని ఆయన ప్రశ్నించారు. తడిచిన మొక్కజొన్న పంటను ఎలాంటి నిబంధనలు లేకుండా కొనుగోలు చేయాలని, నష్టపోయిన రైతుకు ఎకరాకు రూ.50 వేలు పరిహారాన్ని అందించాలని డిమాండ్ చేశారు. కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య మాట్లాడుతూ గడచిన 10 సంవత్సరాల కాలంలో పసుపు రైతుకు ఇంతటి కష్టం ఎన్నడూ చూడలేదన్నారు. తడిసిన పసుపును పూర్తిస్థాయిలో ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. పసుపు రైతుల సంఘం రాష్ట్ర నాయకులు యార్లగడ్డ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పసుపు రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం దశల వారీ ఆందోళన కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ బాపట్ల జిల్లా కార్యవర్గ సభ్యులు గొట్టిముక్కల బాలాజీ, వేమూరు నియోజకవర్గ కార్యదర్శి బందారు శ్రీనివాసరావు, వి.శ్రీనివాసరావు, లంక గ్రామాల రైతులు కొసరాజు సతీష్ బాబు, శ్రీమన్నారాయణ, మురళి, వెంకటేశ్వరరావు, వేములపల్లి రత్న గోపాలరావు, వేములపల్లి వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

35 ఏళ్లలో 42 మంది ఎంపీలపై అనర్హత వేటు

గరిష్ఠంగా 19 మందిపై 14వ లోక్‌సభ చర్యలు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని కోల్పోవడంతో సభ్యులపై అనర్హతవేటు వేసే నిబంధనలు వెలుగులోకి వచ్చాయి. 1988 నుంచి మొత్తం 42 మంది ఎంపీలు తమ పార్లమెంటు సభ్యత్వాన్ని వేర్వేరు కారణాలతో కోల్పోయారు. గరిష్ఠంగా 14వ లోక్‌సభలో 19 మందిపై అనర్హత వేటు పడింది. పార్టీలు ఫిరాయించడం, పార్లమెంటేరియన్‌గా హుందాగా వ్యవహరించకపోవడం, నేరాలకు పాల్పడి దోషులుగా రుజువై రెండేళ్ల లేక అంతకుమించి శిక్షపడడం వంటి అనేక కారణాలతో ఎంపీలు తమ లోక్‌సభ, రాజ్యసభ సభ్యత్వాలను కోల్పోయారు. ఇటీవల రాహుల్ గాంధీ, ఎన్‌సీపీ నేత మహమ్మద్ ఫైజల్, బీఎస్పీ నేత అఫ్జల్ అన్సారీపై ప్రజా ప్రతినిధుల చట్టం కింద చర్యలు తీసుకున్నారు. హత్యాయత్నం కేసులో పడిన శిక్ష అమలుపై కేరళ హైకోర్టు స్టే విధించడంతో లోక్‌సభలో లక్షద్వీప్‌కు ప్రాతినిధ్యం వహించే ఫైజల్ సభ్యత్వాన్ని పునరుద్ధరించారు. పరువునష్టం కేసులో పడిన రెండేళ్ల శిక్ష రద్దును కోరుతూ గుజరాత్ హైకోర్టును రాహుల్ ఆశ్రయించగా ఆయనకు ఎదురుదెబ్బ తగిలింది. ఫిరాయింపుల నిరోధక చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత 1985లో లోక్‌సభ సభ్యుడు లాల్దుహోమాపై మొదటిసారి అనర్హత వేటు పడింది. ఈయన కాంగ్రెస్ సభ్యుడు కాగా సొంత పార్టీ అయిన మిజో నేషనల్ యూనియన్ అభ్యర్థిగా మిజోరం అసెంబ్లీ ఎన్నికల కోసం నామినేషన్ దాఖలు చేశారు. దీంతో పార్లమెంటు సభ్యత్వాన్ని కోల్పోయారు. అలాగే తొమ్మిదవ లోక్‌సభలో తొమ్మిది మందిపై, 14వ లోక్‌సభలో గరిష్ఠంగా 10 మంది (లోక్‌సభ), తొమ్మిది మంది (రాజ్యసభ)పై వేటు పడింది. పార్లమెంటులో ప్రశ్నించేందుకు లంచాలు తీసుకున్నట్లు, క్రాస్ ఓటింగ్ చేసినట్లు ఆరోపణలు రాగా వీరు తమ సభ్యత్వాన్ని కోల్పోయారు. ఇది యూపీఏ-1 హయాంలో జరిగింది. 'ప్రశ్నకు నగదు' కుంభకోణం కింద 2005లో ఆరుగురు బీజేపీ సభ్యులు, బీఎస్పీ నేతలు ఇద్దరు, కాంగ్రెస్, ఆర్జేడీ నుంచి చెరొకరు లోక్‌సభ సభ్యత్వాన్ని కోల్పోయారు. బీఎస్పీ రాజ్యసభ సభ్యుడు కూడా అనర్హతకు గురయ్యారు. అయితే ఈ అనర్హతలను సుప్రీంకోర్టు సమర్థించింది. దీంతో వాటిని రాష్ట్రపతికి సిఫార్సు చేయాల్సిన అవసరం రాలేదు అని లోక్‌సభ మాజీ అదనపు కార్యదర్శి దేవేంద్ర సింగ్ ఐశ్వాల్ తెలిపారు. 1989లో ముఫ్తీ మహమ్మద్ సయీద్, 1989లో సత్యపాల్ మాలిక్, 2017లో శరద్ యాదవ్, 2017లో అలీ అన్వర్ తమ రాజ్యసభ సభ్యత్వాన్ని కోల్పోయారు. 2001, 2006లో 'ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్' వల్ల జార్ఖండ్ ముక్తి మోర్చా నేత శిబూసోరెన్, సమాజ్‌వాదీ పార్టీ నేత జయా బచన్‌పై రాజ్యసభ అనర్హత వేటు వేసింది. కాంగ్రెస్ మాజీ అధినేత్రి సోనియాగాంధీకి ఇదే తరహా పరిస్థితి ఎదురైంది. ఎంపీగా ఉంటూనే జాతీయ సలహా మండలి చైర్‌పర్సన్‌గా కొనసాగారు. అయితే లోక్‌సభకు రాజీనామా చేయడంతో ఆమెపై అనర్హత పిటిషన్ వ్యర్థమైంది. రాజకీయ తిరుగుబాటు తరహా పరిస్థితులను నివారించేందుకు పార్లమెంటు (అనర్హత నివారణ) చట్టం, 1959ను 2006లో సవరించారు. దీంతో చాలా వరకు పిటిషన్లు నిర్వీర్యమయ్యాయి. కాగా, లిల్లీ థామస్ కేసులో సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రెండేళ్లు లేక అంతకుమించి శిక్ష పడితే ఎన్నికైన ప్రతినిధి స్వతసిద్ధంగా అనర్హతకు గురవుతారు. ఆ తర్వాత ఏర్పడిన ఖాళీ గురించి లోక్‌సభ సెక్రటేరియట్ నోటిఫికేషన్ జారీ చేస్తే సరిపోతుంది. దాని అధారంగా ఉప ఎన్నికల ప్రక్రియను ఎన్నికల కమిషన్ ప్రారంభిస్తుంది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కాంగ్రెస్ రాజ్యసభ ఎంపీ రషీద్ మసూద్‌పై అనర్హత వేటు పడింది. ఆయనకు అవినీతి కేసులో శిక్ష విధించారు. ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్, జేడీయూ సభ్యుడు జగదీశ్ శర్మ కూడా పశుదాణా కేసు వల్ల పార్లమెంటు సభ్యత్వాన్ని కోల్పోయారు.

సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డిని హైదరాబాద్‌లోని నివాసంలో కలిసి ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చిస్తున్న సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ. పక్కన సీపీఐ శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి ఎం. వేమయ్య.

ప్రశాంతంగా 'నీట్'

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాలకు జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్-యూజీ 2023) ఆదివారం రాష్ట్రంలో ప్రశాంతంగా ముగిసింది. ఈ పరీక్షకు ఏపీ నుంచి సుమారు 60వేల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరి కోసం రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన 140 పరీక్షా కేంద్రాల్లో పకడ్బందీగా పరీక్ష నిర్వహించారు. అత్యధికంగా విజయవాడ నగరంలో దాదాపు 27 పరీక్షా కేంద్రాల్లో సుమారు 15వేల మంది విద్యార్థులు ఈ పరీక్ష రాశారు. పరీక్ష మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.20 గంటల వరకు నిర్వహించారు. ఆఫ్‌లైన్‌లో నిర్వహించిన ఈ పరీక్ష తెలుగుతోపాటు, మొత్తం 13 ప్రాంతీయ భాషల్లో రాసే అవకాశం కల్పించారు. విద్యార్థులను మెటల్ డిటెక్టర్లతో తనిఖీ చేసిన తర్వాతే పరీక్ష హాలులోకి పంపించారు. బాలికలకు సంబంధించి చెవిపోగులు, ముక్కు పుడకలు సైతం ధరించకుండా తీసివేయించారు. అడ్మిట్ కార్డు, ఐడీ ప్రూఫ్, రెండు పాస్ పోర్టు సైజు ఫొటోలను మాత్రమే అనుమతించారు. ఎయిమ్స్‌కి చెందిన విద్యాసంస్థల్లో ప్రవేశాలకు గాను పీజీ విద్యార్థులకు కూడా ఆదివారం ఉదయం ఇనీసెట్ పరీక్ష నిర్వహించారు.

వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో

బలమైన ప్రాంతీయ పార్టీలకు మద్దతు ఇవ్వండి

ప్రతిపక్షాలకు ఎన్‌సీ నేత ఫరూఖ్ అబ్దుల్లా సూచన



శ్రీనగర్ : 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఎదుర్కోవడానికి ప్రధాన ప్రతిపక్షాలు బలమైన ప్రాంతీయ పార్టీలకు మద్దతు ఇవ్వాలని ప్రముఖ రాజకీయ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి ఫరూఖ్ అబ్దుల్లా ఆదివారం అన్నారు. 'ప్రతిపక్షాల ఐక్యత గురించి నాకు అంతగా నమ్మకం లేదు. కానీ లోక్‌సభ ఎన్నికలకు సంబంధించినంత వరకు రాష్ట్రాలు ఇప్పుడు ముఖ్యమని నేను భావిస్తున్నాను. అన్ని ప్రతిపక్ష పార్టీలు దానిని గ్రహించాలి' అని అని 85 ఏళ్ల అబ్దుల్లా అన్నారు. ఒక ఉదాహరణ ఇస్తూ, పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ బలంగా ఉంటే, 'టీఎంసీ నాయకుడికి అడ్డంకులు సృష్టించడం కంటే ఆమె బాగా చేసేలా చూసుకోవాలి. అదేవిధంగా, బీహార్‌లో నితీశ్ కుమార్ (జేడీయూ), ఆర్జేడీ బాగా పనిచేస్తుంటే, వారికి అడ్డంకులు సృష్టించవద్దు. అదే విధంగా ఉత్తరప్రదేశ్‌లో అఖిలేశ్ యాదవ్ (ఎస్పీకి) బాగా పనిచేస్తున్నారు. అందువల్ల మనం అలాంటి పరిస్థితిని సృష్టించకూడదు' అని తెలిపారు. 'నేను చాలా ముఖ్యమైన విషయం ఏమిటంటే, మీరు నిజంగా వారిని (బీజేపీ) ని ఓడించాలనుకుంటే, ఒకరికి వ్యతిరేకంగా ఒకరు ఉండాలి. కాంగ్రెస్ అభ్యర్థి గెలుపొందిన చోట మరొకరిని నిలబెట్టకూడదు. ఎక్కడ వేరే పార్టీ గెలుస్తుందో ఆ పార్టీ తమ అభ్యర్థిని పెట్టే అవకాశం ఇవ్వండి. వారి ఆటలో వారిని నిజంగా ఓడించడానికి ఇది ఒక మార్గం' అని అబ్దుల్లా పీటీఐ వార్తా సంస్థకు చెప్పారు. ప్రతిపక్ష నేతలకు ఈ విధానాన్ని సూచించారా అని అడిగిన ప్రశ్నకు, నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు వారు ఏమి చేయాలో ఆలోచించాలని అన్నారు. 'వారు దీనిని పరిగణనలోకి తీసుకుంటారని నేను ఆశిస్తున్నాను' అని తెలిపారు. కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), ఆదాయపు పన్ను శాఖ (ఐటీ) వంటి కేంద్ర సంస్థలను దుర్వినియోగం చేశారనే ఆరోపణలపై కూడా గతంలో జమ్ముకశ్మీర్ రాష్ట్రానికి మూడుసార్లు ముఖ్యమంత్రి, శ్రీనగర్ సిట్టింగ్ ఎంపీగా ఉన్న ఫరూఖ్ అబ్దుల్లా మాట్లాడారు. 'ఇది గతంలో జరిగింది. ఈ (బీజేపీ) వాళ్లు మాత్రమే అలా చేయలేరు. ఇతరులు చేసిన దానికంటే 100 రెట్లు ఎక్కువ చేస్తున్నారు. కానీ రాబోయే ప్రభుత్వాలు ప్రతిపక్షాలను దెబ్బతీయడానికి ఈ దర్యాప్తు సంస్థలను ఉపయోగించవని నేను ఆశిస్తున్నాను' అని అన్నారు. 'మన ప్రతిపక్షాలను దెబ్బతీయడానికి ఈ సంస్థలను ఉపయోగించ కూడదు. దేశంలో ప్రతిపక్షం అవసరం. అందువల్ల, ప్రజాస్వామ్య దేశంలో ఈ దర్యాప్తు సంస్థలను ఈ పద్ధతిలో ఉపయోగించడం పూర్తిగా తప్పు, అలా చేయకూడదు' అని ఆయన అన్నారు. 'ఏ ప్రజాస్వామ్య దేశానికైనా ప్రతిపక్షం తప్పనిసరి. అప్పుడే ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుంది. ప్రపంచంలో భారతదేశం మరింత బలపడుతుంది' అని అన్నారు. వరల్డ్ ప్రెస్ ఫ్రీడమ్ ఇండెక్స్‌లో భారత దేశం 180కి 161కి పడిపోయిందని ఆయన విచారం వ్యక్తం చేశారు. 'మనం పత్రికా స్వేచ్ఛను ఎంత నాశనం చేశామో ఇది చూపిస్తుంది. ఇది ప్రజాస్వామ్యానికి శ్రేయస్కరం కాదు. ప్రెస్ మీపై నిఘా ఉంచుతుంది. ప్రజాస్వామ్య దేశానికి నిఘా అవసరం' అని ఫరూఖ్ అబ్దుల్లా తెలిపారు.

సముద్ర ఈత పోటీల్లో విజయవాడ వనిత ప్రతిభ



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: అవార ఈత శిక్షణ-ప్రాణరక్షణ అకాడమీ మహిళా కోచ్, శకుంతలాదేవి చెన్నైలో ఆదివారం ఉదయం జరిగిన అక్వాఫెస్ట్ 2023లో భాగంగా ఒక కిలోమీటరు స్విమాథాన్ ఈత పోటీలలో ప్రథమ స్థానంలో నిలిచి బహుమతి గెలుచుకున్నారు. తమిళనాడు ప్రభుత్వ పర్యాటక అభివృద్ధి సంస్థ అధ్వర్యంలో త్రిచాంప్ సంస్థ ఏటా వేసవిలో బంగాళాఖాతం కోవలం బీచ్‌లో నిర్వహించే ఈ జాతీయ స్థాయి సముద్ర ఈత పోటీలలో అన్ని రాష్ట్రాల నుండి వందలాది స్విమ్మర్లు పాల్గొంటారు. మరో అవార స్విమ్మర్ రామానందకిషోర్ పురుషుల విభాగంలో 7వ స్థానంలో నిలిచినట్లు అవార వ్యవస్థాపకులు ప్రొఫెసర్ అజయ్ కాట్రగడ్డ తెలిపారు. కృష్ణానదిలో అనేక దశాబ్దాలుగా ఈదే ఈతగాళ్లను ఇటీవల నదిలోకి రెగ్యులర్ ప్రాక్టీసుకు వెళ్లనివ్వకుండా పోలీస్ అధికారులు ముళ్ల కంచెలు వేసి ఆటంకాలు కల్పిస్తున్నప్పటికీ జాతీయస్థాయిలో మన ఈతగాళ్లు రాణించడం విశేషంగా అజయ్ పేర్కొన్నారు.

పుష్ప-2లో నిహారిక?

హైదరాబాద్: ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ , నేషనల్ క్రష్ రష్మిక మందన జంటగా తెరకెక్కిన చిత్రం 'పుష్ప'. క్రియేటివ్ డైరెక్టర్ సుకు మార్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం పాన్ ఇండియా రేంజ్‌లో ఇంపాక్ట్ క్రియేట్ చేసింది. ప్రత్యేకించి బన్నీ మ్యానరిజమ్స్, రా అండ్ రస్టిక్ లుక్‌కు తోడు సాంగ్స్, సుకుమార్ స్టోరీ టెల్లింగ్‌కు దేశవ్యాప్తంగా అన్ని భాషల ప్రేక్షకులు ఫిదా అయ్యారు. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం షూటింగ్ జరుపుకుంటున్న 'పుష్ప2' చిత్రంపై భారీ అంచనాలున్నాయి. అందుకు తగ్గట్లే 'పుష్ప: ది రూల్' సినిమాను మరింత గ్రాండియర్‌గా రూపొందిస్తున్న మేకర్స్... రెండో భాగంలో మరిన్ని పాత్రలను యాడ్ చేశారు. ఇదే క్రమంలో ఒక కీలక పాత్ర కోసం మెగా డాటర్‌ను తీసుకుంటున్నట్లు సమాచారం.

కన్నీటి నివాళి

CPI | AITUC

కీ॥శే॥ కామ్రేడ్ గౌరిబోయిన రాధాకృష్ణమూర్తి గారు

జననం : 15-07-1933 మరణం : 26-04-2023

అందరిని చిరునవ్వుతో పలకరించే మహోన్నత వ్యక్తిత్వం, మానవత్వం గల మంచి మనిషి కామ్రేడ్ గౌరిబోయిన రాధాకృష్ణమూర్తి గారికి నివాళులు

అమ్మిశెట్టి శివ(కన్వీనర్)	కుమ్మరి కోటేశ్వరరావు
చల్లా చిన ఆంజనేయులు	కడియం సాంబశివరావు
జి. సుధాకర్	తాడిబోయిన చిన్న బుజ్జి
జి. సురేష్ బాబు	గౌరిబోయిన బాలకృష్ణ
మండవ సాంబశివరావు	కుర్రా గంగరాజు (కొండపల్లి)
కోట మాల్యాద్రి	షేక్ సుభాని
యాపర్తి సృజన్	రామనబోయిన అజయ్
రావుల అంజిబాబు	జి.ప్రమోద్
అమ్మిశెట్టి రాఘవ	బత్తుల గోవర్ధన్
గుమ్మా యర్రయ్య	షేక్ దావుద్ అలీ (బాబు)

జి.వి. కృష్ణారావు మెమోరియల్ ట్రస్ట్, రేగుల రాఘవయ్య భవన్, సంగడిగుంట, గుంటూరు

పాక్ జట్టును పంపేందుకు పీసీబీ షరతులు

న్యూఢిల్లీ: భారత్‌లో ఈ ఏడాది జరగబోయే వన్డే ప్రపంచకప్ కోసం పాక్ జట్టును పంపేందుకు పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) షరతులు విధిస్తోంది. ఈ ఏడాది ఆసియాకప్‌కు పాకిస్తాన్ ఆతిథ్యం ఇవ్వనుంది. మరో వైపు ఐసీసీ మెగాటోర్నీ అయిన వన్డే ప్రపంచకప్‌కు భారత్ ఆతిథ్యం ఇవ్వబోతోంది. ఈ క్రమంలో భారత్-పాక్‌ల మధ్య కొంతకాలంగా టోర్నీల మాటల తూటాలు పేలుతున్నాయి. ఆసియా కప్ సెప్టెంబర్‌లో పాక్ నిర్వహించాల్సి ఉంది. ఈ క్రమంలో భారత జట్టును పాక్‌కు పంపేది లేదని, తటస్థ వేదికల్లో నిర్వహించాలని బీసీసీఐ స్పష్టం చేసింది. ఇరుదేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న దృష్ట్యా జట్టును పాక్‌కు పంపడం సాధ్యం కాదని పేర్కొంటున్నది. అయితే, ఈ ఏడాది అక్టోబర్‌లో జరిగే వన్డే ప్రపంచ కప్‌లో తాము పాల్గొనబోమని పీసీబీ అంటున్నది. ఈ క్రమంలోనే తాజాగా ప్రపంచకప్ కోసం పాక్ జట్టును భారత్‌కు పంపే విషయంలో బీసీసీఐకి పీసీబీ షరతులు విధించింది. 2025లో పాక్‌లో జరిగే ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో టీమిండియా పాల్గొంటుందని బీసీసీఐ కార్యదర్శి జై షా రాతపూర్వకంగా హామీ ఇవ్వాలని, అప్పుడు పాక్ జట్టును భారత్‌కు పంపుతామని చెప్పినట్లు పీసీబీ చైర్మన్ నజామ్ సేథి స్పష్టం చేసినట్లు సమాచారం. మరో వైపు పాక్ ఆతిథ్యం ఇవ్వనున్న ఆసియా కప్‌లో టీమిండియా ఆడే మ్యాచ్‌లను యూఏఈ వేదికగా నిర్వహించాలన్న 'హైబ్రిడ్ మోడల్'కు ఆసియా క్రికెట్ కౌన్సిల్ అధ్యక్షుడు జై షా ఇంకా ఆమోదం తెలపలేదు. టోర్నీ మొత్తాన్ని తటస్థ వేదికపైనే నిర్వహించాలని బీసీసీఐ డిమాండ్ చేస్తోంది. ఈ క్రమంలో ఆసియా కప్, వన్డే ప్రపంచకప్ విషయంలో సేథి ఏసీసీ, ఐసీసీ అధికారులపై ఒత్తిడి తేవాలని చూస్తున్నారని సమాచారం. ఇందు కోసం ఆయన ఈ నెల 8న దుబాయికి వెళ్లనున్నట్లు తెలుస్తోంది. ఆసియా కప్‌ను పాక్‌లో నిర్వహించకపోయినా, హైబ్రిడ్ మోడల్‌కు అంగీకరించకపోయినా ఆ టోర్నీలో పాక్ ఆడబోదని ఐసీసీకి స్పష్టం చేయనున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. అదే సమయంలో 2025 చాంపియన్స్ ట్రోఫీలో పాల్గొనేందుకు బీసీసీఐ హామీ ఇవ్వాలని సేథి పట్టుబడుతున్నారని తెలిపాయి.

గుజరాత్ జైత్రయాత్ర... లక్నోపై ఘన విజయం

అహ్మదాబాద్: ఐపీఎల్ 2023లో గుజరాత్ టైటాన్స్ జైత్రయాత్ర కొనసాగుతోంది. విజయాల పరంపరతో దూసుకెళ్తోంది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా లక్నో సూపర్ జెయింట్స్‌పై ఆదివారం జరిగిన మ్యాచ్‌లో మరో గెలుపును సొంతం చేసుకుంది. 228 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన లక్నో బ్యాటర్లను కట్టుదిట్టమైన బౌలింగ్‌తో కట్టడి చేసింది. దీంతో నిర్ణీత 20 ఓవర్లు ఆడిన లక్నో 7 వికెట్లు కోల్పోయి 171 పరుగులకే పరిమితమైంది. దీంతో 56 పరుగుల తేడాతో గుజరాత్ ఘనవిజయం సాధించింది. దీంతో ఈ ఐపీఎల్ సీజన్‌లో 8వ విజయం తన అగ్రస్థానాన్ని మరింత పదిలం చేసుకుంది. లక్నో బ్యాట్స్‌మెన్లలో కెయిల్ మేయర్స్ (48), క్వింటన్ డీకాక్ (70) రాణించినప్పటికీ దీపక్ హుడా (11), మార్కస్ స్టొయినిస్ (4), నికొలస్ పూరన్ (3), ఆయుష్ బదోని (21), స్వప్నిల్ సింగ్ (2 నాటౌట్), కృనాల్ పాండ్యా (0), రవి బిష్ణోయ్ (4 నాటౌట్) విఫలమయ్యారు. గుజరాత్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. ముఖ్యంగా మోహిత్ శర్మ లక్నో నడ్డి విరిచాడు. అత్యధికంగా 4 వికెట్లు తీశాడు. ఆ తర్వాత మహ్మద్ షమీ, రషీద్ ఖాన్, నూర్ అహ్మద్ తలో వికెట్ తీశారు.

చెలరేగిన శుభ్‌మన్, సాహా: టాస్ గెలిచిన లక్నో జట్టు ఫీల్డింగ్ ఎంచుకోవడంతో గుజరాత్ టైటాన్స్ తొలుత బ్యాటింగ్ చేసింది. ఓపెనర్లు వృద్ధిమాన్ సాహా(81), శుభ్‌మన్ గిల్(94 నాటౌట్) ఆకాశమే హద్దుగా చెలరేగారు. డేవిడ్ మిల్లర్(21 నాటౌట్) కూడా ధనాధన్ ఇన్నింగ్స్ ఆడడంతో గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో కేవలం 2 వికెట్లు మాత్రమే కోల్పోయి 227 పరుగులు సాధించింది. లక్నో సూపర్ జెయింట్స్ బౌలర్లను ఉతికారేసిన సాహా, గిల్ తొలి వికెట్‌కు రికార్డు స్థాయిలో 142 పరుగులు జోడించారు. ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడీని అవేశ్‌ఖాన్ విడదీశాడు. సాహా ఔటయ్యాక గిల్, కెప్టెన్ హార్దిక్ పాండ్యా(10) ధాటిగా ఆడారు. పాండ్యా తర్వాత వచ్చిన మిల్లర్ మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. లక్నో బౌలర్లలో అవేశ్ ఖాన్, మొహిసిన్ ఖాన్ చెరొక వికెట్ తీశారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా శుభ్‌మన్ ఎంపికయ్యాడు.

శ్రద్ధాంజలి

కీ.శే. కామ్రేడ్ గౌరిబోయిన రాధాకృష్ణమూర్తి గారు

జననం : 15-07-1933 మరణం : 26-04-2023

అనురాగం, ఆప్యాయత, మంచితనానికి, మారుపేరుగా నిలచిన మీ నిష్క్రమణం మాకు తీరని లోటు. మీ జ్ఞాపకాలు మా మదిలో ఎల్లప్పడూ మెదులుతూనే ఉంటాయి. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తూ...

భార్య : గౌరిబోయిన శకుంతల (లేటు)

కుమారుడు- కోదలు
గౌరిబోయిన బాలకృష్ణమూర్తి
గౌరిబోయిన వెంకట దుర్గా నాగమణి

అల్లుడు - కూతురు
కుర్రా గంగరాజు- గౌరిబోయిన రాధిక

అన్నగారి కుమారులు - కుమార్తె
గౌరిబోయిన సుధాకర్- పద్మావతి
గౌరి బోయిన సురేష్ - కోటేశ్వరమ్మ
గౌరిబోయిన సుకుమార్ - కుమారి
రామనబోయిన సుగుణ - అక్కులయ్య

మనుమలు, మనుమరాలు : సానబోయిన సాయి మౌన ప్రియ-కళ్యాణ్, కృష్ణచైతన్య కావ్య - రాగేష్ ఎస్

పెద్దకర్మ : ది. 08-05-2023న కొండపల్లిలోని మా స్వగృహమునందు జరుగును.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.